J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 4 26.6.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

● ఆంధ్రాలో కులరాజకీయాలు

# ఇది కొత్త కథ కాదు.. పాత వ్యథ



## కులరహిత రాజకీయాలు సాధ్యమేనా?


## నాయకులకు కులాలు ఆపాదించడం కరెక్టేనా?

## పవన్ వ్యాఖ్యలతో మరోసారి చర్చ!

**కులం, మతం, ప్రాంతం, జాతి, లింగభేదం, వీటిలో రాజకీయాలకు కాదేదీ అనర్హం. ముఖ్యంగా మూడువేలకు పైగా కులాలు, ముక్కోటి దేవతలున్న భారతదేశంలో, అందునా ఆంధ్రాలో పాలిటిక్స్ అంటేనే కులాల కుంపట్లకు పేరుగాంచింది. ఇక్కడ అభివృద్ధి సంక్షేమం కంటే మా కులం, మా వాడు, మా రక్తం, మా వర్గం అనే అంశాలే ఓటుబ్యాంకు రాజకీయాలను రక్తిగట్టిస్తాయి. అందుకే ఇక్కడ కులాలను, రాజకీయాలను వేరుచేసి చూడలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో క్రిమినల్స్‌కు కులాన్ని ఆపాదించడం, తప్పుచేసిన వారిని కులప్రాతిపదికన వెనుకేసుకురావడం ఇక్కడ కొత్తేమీ కాదు.**

అయితే, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాను క్రిమినలైజ్డ్ పాలిటిక్స్‌కు వ్యతిరేకమని, తాను పుట్టిన కులంలోనైనా ఓ రౌడీ తప్పుచేస్తే తాను వెనకేసుకురానని, అసలు తనకు ఓ కులాన్ని ఆపాదించి కులనాయకుడిగా ముద్రవేయడం తగదని ఇటీవల హితవుపలికారు. పైగా కేవలం ఓట్లు సీట్లే కాకుండా, జాతీయత, సమైక్యతే రాజకీయాల్లో నాయకుల మూల సిద్ధాంతంగా ఉండా లని చెప్పడం, తాను ఆ కోవలోని వ్యక్తినే అని చాటడం నిజంగా ఆసక్తికరమే. సాంప్రదాయ రాజకీయాలకు అలవాటు పడ్డ ఆంధ్రాలో, కులభావన కంటే జాతీయ భావనే తనకు ఇష్టమని పవన్ బహిరంగంగా ప్రకటిం చడం ఒకింత సాహసోపేత నిర్ణయంగానే భావించాల్సి ఉంటుంది. అయితే, కుల ప్రస్తావన లేకుండా రాజ కీయాలు చేయడం ఆంధ్రాలో సాధ్యమా..? “నా”అనే భావన లేకుంటే ఇక్కడ నాయకులకు ఆయా వర్గాల ప్రజల ఓట్లు పడతాయా?

2లో



# శ్రీసిటీలో.. సూర్య నమస్కారాలు



సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

శ్రీసిటీలో ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత వేడుకగా, ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీసిటీ జనరల్ మేనేజర్ సన్యాసిరావు ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్థానిక విజిటర్స్ సెంటర్ ఆవరణలో జరిగిన యోగా కార్యక్రమంలో శ్రీసిటీతో పాటు పలు పరిశ్రమల ప్రతినిధులు, పోలీసుశాఖ, సెజ్ డెవలప్మెంట్ కార్యాలయ సిబ్బంది, చిన్మయ, అకార్డ్ స్కూళ్ల విద్యార్థులు, స్థానికులు 180మందికి పైగా పాల్గొన్నారు. యోగా గురువు, ఏపీ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.కోదండం ప్రత్యేక అతిథిగా పాల్గొని, సూర్య నమస్కారాలు, వివిధ వ్యాయామాల పట్ల శిక్షణ ఇవ్వడంతో పాటు యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీసిటీ విజిటర్స్ సెంటర్ ఆవరణలో ప్రత్యేక ఆయుర్వేద శిబిరం నిర్వహించారు. శ్రీసిటీలోని తులసి ఆయుర్వేద ఆసుపత్రికి చెందిన డాక్టర్ శివప్రసాద్, వైద్య బృందం పాల్గొన్నారు.

# ఇది కొత్త కథ కాదు.. పాత వ్యధ

(మొదటిపేజీ తరువాయి)

కేవలం అభివృద్ధి, మంచితనం, నిజాయితీ లాంటి సిద్ధాంతాలు పార్టీలకు అధికారాన్ని కట్టబెడుతాయా..? అన్న చర్చ ఇప్పుడు రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది.

## కుల కుబుసం విడడం సాధ్యమా..?

పాము నిర్ణీత సమయంలో తన పాత చర్మాన్ని వదిలి, కొత్త చర్మాన్ని ధరిస్తుంది. దీన్నే పాము కుబుసం విడువడం అంటారు. అలాగే జంతువుల్లో పులులు, సింహాలు తమ కోరలు పెరిగిపోతే వాటంతట అవే వాటిని విరగ్గొడతాయి. ఇక డేగలు, గద్దలు సైతం తమ గోళ్లు పెరిగిపోతే వేట సాధ్యంకాక వాటిని విరిచేసేందుకు యత్నిస్తాయి. తద్వారా కొత్తగోళ్లతో మరింత శక్తితో వేటను ముమ్మరం చేస్తాయి. ఇక మానవజాతిలో సైతం అరాచకం రాజ్యమేలినప్పుడు, ఓర్పు నశించినప్పుడు, సమాజం గతితప్పినప్పుడు, వాటిని సరి చేసేందుకు పోరాటాలు, యుద్ధాలు, విప్లవాలు వంటివి ఉద్భవించి వచ్చి కొత్త చరిత్రను సృష్టిస్తాయి. వీటికి అచ్చమైన ఉదాహరణే మానవుడు మొదట సంచార జీవిగా మొదలై, కాలక్రమంలో సమూహాలు ఏర్పాటు చేసి, చివరికి రాజ్యాస్థాపన చేయడం. అందుకే ఒకప్పుడు పాలన మొత్తం నిరంకుశమైన రాజు చేతిలో ఉంటే, కాలక్రమంలో ప్రజలే ప్రభువులుగా భావించే ప్రజాస్వామ్యం వచ్చింది. ఒకప్పుడు రాజు చెప్పిందే వేదం, ఆయన చెప్పిందే శాసనం, ఆయన చెప్పిందే తీర్పు, అనే పరిస్థితి ఉంటే, ఇప్పుడు చట్టం, న్యాయం, ధర్మం, ప్రాతిపదికన ఏర్పడిన రాజ్యాంగం ప్రకారం పాలన సాగుతోంది. అయితే, ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు, దేశంలో ఎన్ని మారినా..? ఎంతమారినా పాలకులకు పౌరులకు మధ్య ఉండే సన్నని గీత మాత్రం చెరిగిపోలేదు. పాలకులు ఎప్పుడూ శాసించే వారే, పౌరులెప్పుడూ పాటించే వారే, ఎవరు అవునన్నా, ఎవరు కాదన్నా ఇదే నిజం.. ఇదే సత్యం. అయితే ప్రజలను తమవైపు తిప్పుకునేందుకు తమ పార్టీకే జై కొట్టించుకునేందుకు పాలకులు వాడే ప్రధాన ఆయుధం కులం. మనం... మనం ఒకటే అనేలా తమ వర్గాన్ని చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు రాజకీయ నాయకులు ఎప్పుడూ వ్యూహాలు పన్నుతూనే ఉంటారు. ఇందుకోసమే ప్రత్యేక ప్రణాళికలు సైతం రచిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలను, కులాలను వేరుచేసి, విడదీసి చూడడం సాధ్యమయ్యే పనేనా అంటే, ఎక్కువమంది కాదనే సమాధానమే ఇస్తారు. అయితే మార్పు కోసం, ప్రశ్నించడం కోసం రాజకీయాల్లోకి వచ్చానని ప్రకటించిన పవన్‌కల్యాణ్ కుల కుబుసం విడిచిపెట్టి రాజకీయాలలో నెగ్గుకు రావడం సాధ్యమేనా..? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నే. ఎందుకంటే రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలైన టీడీపీ వైఎస్సార్‌సీపీ ఎంత కాదన్నా తమ అధినేతల కులానికి తొలి ప్రాధాన్యతని ఇస్తాయన్నది నిర్వివాదాంశం. మరి పవన్ చెబుతున్న కులరహిత సమాజం, వాస్తవ పరిస్థితుల్లో సాధ్యమా...? కాపునేతలు దీన్ని ఎలా అర్థం చేసుకుంటారు...? అన్నది ఆసక్తికరం. ఏదేమైనా నాకు కులం కాదు దేశం ముఖ్యం అంటూ పవన్ తీసుకొచ్చిన కొత్త నినాదం మాత్రం కులరహిత రాజకీయాల ప్రస్థానంలో మొదటి మెట్టుగా భావించవచ్చు.

## రెడ్డి, కమ్మ, కాపు ప్రస్తావన లేకుండా..?

ఆంధ్రప్రదేశ్ పురుడుపోసుకున్న కాలం నాటి నుంచి రాష్ట్రంలో రెడ్లు, కమ్మలు, అత్యధికకాలం ప్రజాప్రతినిధులై రాష్ట్రాన్ని పాలించారు. ముఖ్యమంత్రులై చరిత్ర సృష్టించారు. అయితే, ఈ రెండు వర్గాలు కాకుండా తగినంత అంగ, ఆర్థిక బలం ఉన్నా ప్రభుత్వాధినేతలు కాలేకపోయిన ప్రధాన కులం కాపులు. అందుకే నేమో ఈ వర్గంలో మొదటి నుంచి రాజకీయపరంగా ఏ నాయకుడూ ముఖ్యమంత్రి కాలేకపోయారనే అసంతృప్తి దశాబ్దాలుగా ఉంది. అయితే ఈ కులం నుంచి వచ్చిన నాయకులు కింగ్ మేకర్లుగా రాష్ట్రంలో చక్రం తిప్పారే తప్ప కింగ్‌లు మాత్రం కాలేకపోయారన్న చర్చ తరచూ తెరపైకి వస్తుంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని రెడ్లు, కమ్మల్లో అధికశాతం మంది వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం తమ పార్టీలే అన్నట్లుగా ముందుకు సాగుతారు. ఎన్నికల్లో ప్రభావం చూపే అభివృద్ధి, సంక్షేమం, ప్రాంతీయత కంటే వీరు తమ కులానికే అధిక ప్రాధాన్యం ఇస్తారు. అయితే సుదీర్ఘకాలం పాటు నాయకత్వ లేమితో అల్లాడుతున్న కాపులకు గత ఎన్నికల్లో పవన్ ఆశాకిరణంలా కనిపించారు. అభివృద్ధి అనే భావన లేకపోయినా కులభావనతో అయినా తన పార్టీకి ఓటు వేయాలని ఎన్నికల ప్రచారంలో ఆయన కాపులకు పిలుపునిచ్చారు కూడా. ఇక 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన తర్వాత అందరివాడుగా గుర్తింపు పొందేందుకు యత్నిస్తున్నారు. రాజకీయాల్లో ఎవరో ఒకరు, ఎపుడో అపుడు మార్పుకోసం ముందడుగు వేయాలని ఆయన పిలుపునిస్తున్నారు. అందుకే కులగజ్జిలేని సమాజం కోసం, కుల ప్రస్తావన లేని రాజకీయాల కోసం ఆయన తపిస్తున్నారు. మార్పు తెచ్చే రాజకీయాల కోసం ప్రయత్నిస్తున్నారు. ఇటీవల విజయవాడ కృష్ణలంకలో అదృశ్యమైన సాయికృష్ణ అనే కాపు యువకుడి లాకప్ హత్య రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కలిగించింది. అతడిని పోలీసులే కొట్టి చంపారని, లాకప్ డెత్ చేశారని అతడి కుటుంబ సభ్యులతో పాటూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ కూడా ఆరోపించింది. జనసేనకు చెందిన సాయికృష్ణ బంధువులు తాము గత ఎన్నికల్లో పవన్ కోసం పనిచేశామంటూ ప్రకటించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అయితే తనది కుల భావనతో రాజకీయాలు చేసే మనస్తత్వం కాదని, గతంలో పదుల సంఖ్యలో కేసుల్లో నిందితుడిగా ఉన్న సాయికృష్ణ అదృశ్యాన్ని కులంతో ముడిపెట్టి చూడలేనని పవన్ తేల్చిచెప్పారు. తాను పుట్టిన కులంలో అయినా తప్పు చేసిన వారిని వెనకేసుకురానని స్పష్టం చేశారు. పైగా క్రిమినల్స్‌కు కులాలను ఆపాదించే సంస్కృతి పోవాలంటూ పిలుపునిచ్చారు. తప్పు చేసిన వారిని వెనకేసుకు వచ్చే ఉద్దేశం తనకు లేదని, భారతీయతే ప్రధానంగా భావించే జనసేన మూల సిద్ధాంతానికి అది వ్యతిరేకమని, కాపు కులంలో ఎవరో తప్పు చేస్తే అందులోకి తననెందుకు లాగుతున్నారని పవన్ ప్రశ్నించారు. కులం కంటే గుణం గొప్పదని, ప్రాంతీయత కంటే జాతీయత గొప్పదన్న విషయాన్ని అందరూ తెలుసుకోవాలని హితవు పలికారు.

ఏదేమైనా మహోన్నత ఆశయంతో కుల రహిత రాజకీయాలే తమ ధ్యేయమని ప్రకటించిన పవన్ గుండె ధైర్యాన్ని మాత్రం కొనియాడాల్సిందే. మరి పవన్ తీసుకున్న నిర్ణయాన్ని కాపులు ఎలా అర్థం చేసుకుంటారు..? సాంప్రదాయ రాజకీయ వ్యూహాల్లో నిత్యం తలమునకలయ్యే తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ సైతం కుల రహిత రాజకీయాల కోసం ముందడుగు వేస్తాయా..? అన్నది కాలమే నిర్ణయించనుంది. ఒక్కటి మాత్రం నిజం, మార్పు కోసం ప్రజల తీర్పును ఆశిస్తూ పవన్ తీసుకున్న కులరహిత రాజకీయాలు అనే నినాదం, విలువలకు తిలోదకాలిచ్చే రాజకీయ ఎడారిలో ఒయాసిస్ వంటిదే అనడంలో సందేహం లేదు.

ఇప్పుడు పవన్ మాట్లాడినా, రేపు ఇంకొక నాయకుడు పెదవి విప్పినా ఆంధ్రాలో కుల రాజకీయాల అంశం మాత్రం కొత్త కథ కాదు, ముమ్మాటికీ పాత వ్యధే..!

# అభివృద్ధికి మరోపేరుగా.. నెల్లూరు రూరల్

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి




జనసేన వీరమహిళలతో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభింపజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి మరోపేరుగా ఉంటోంది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చొరవతో రూరల్‌లో ఇటీవలి కాలంలో కోట్లాది రూపాయల అభివృద్ధిపనులు జరుగుతున్నాయి. ఈనెల 24న 29వ డివిజన్ గాంధీనగర్‌లో సుమారు 2.75 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన మెయిన్‌రోడ్డు డివైడర్ పనులు, సెంట్రల్ లైటింగ్ పనులకు జనసేన వీరమహిళలతో ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రారంభోత్సవం చేయించారు. స్థానిక నాయకులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్‌లో వీరోచిత పోరాటం చేసి అమరుడైన ఆంధ్రుడు వీరజవాన్ మురళీనాయక్ పేరును ఈ రోడ్డుకు నామకరణం చేస్తామన్నారు. గాంధీనగర్ తరహాలోనే రూరల్‌లోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా రోడ్లకు సెంట్రల్ లైటింగ్ పనులు చేయిస్తామన్నారు. రూరల్ ప్రజలు ఏ సమస్య తన దృష్టికి తెచ్చినా వెంటనే స్పందిస్తానని, ఒక్క ఫోన్ చేస్తే చాలు వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, స్థానిక జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసంతో బతకాలి

- విద్యార్థులకు అధికారుల అవగాహన




ఎవరైనా ఎంతటి సమస్యలున్నా ఆత్మవిశ్వాసంతో వాటన్నిటినీ అధిగమించాలని, అంతేతప్ప మానసిక వత్తిడులకు గురై ఆత్మహత్యలు చేసుకోకూడదని అధికారులు సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 24న నెల్లూరు వేదాయపాళెంలో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో జరిగిన ఆత్మహత్యల నివారణ సదస్సులో వారు మాట్లాడారు. సమస్యలను తెలివిగా, చాకచక్యంగా పరిష్కరించుకోవాలని, ఒకవేళ ఒత్తిడికి గురైతే మీ తల్లిదండ్రులను కానీ లేదా స్నేహితులను గాని సంప్రదించి ఆ సమస్యలకి పరిష్కారం చూసుకోవాలని చెప్పారు. విద్యార్థులు మంచి లక్ష్యాల సాధనకోసం కష్టపడి చదువుకుని అభివృద్ధిని సాధించాలంటూ వారిలో సదవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ సోషల్ కౌన్సిలర్ టి.కమల, సిహెచ్ సమత, చైల్డ్ కౌన్సిలర్ బి.జ్యోష్న, కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## వెంకటగిరి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్..
# తులసి జ్యోతికి గౌరవ డాక్టరేట్



తిరుపతిజిల్లా వెంకటగిరిలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డి.తులసి జ్యోతికి అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ అమెరికా విశ్వవిద్యాలయం నుండి ఇటీవల గౌరవ డాక్టరేట్ లభించింది. విద్యాశాఖలో ఆమె ఉత్తమ సేవలకు జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి.. జాతీయ స్థాయి దాకా మంచి గుర్తింపు లభించింది. ఆమేరకు విద్యాశాఖ ధ్రువీకరణ మరియు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆల్ ఇండియా వారి సూచనల మేరకు ఈ గౌరవ డాక్టరేట్(డి.లిట్) తనకు లభించినట్లు ఆమె తెలిపారు. జాతీయస్థాయిలో ఈ ఏడాది ఈ పురస్కారం నలుగురికే లభించిందని, అందులో తాను ఒకరు కావడం తనకెంతో సంతోషం కలిగించిందని ఆమె అన్నారు. తులసి జ్యోతికి గౌరవ డాక్టరేట్ లభించడంతో ఆమె సహఉపాధ్యాయినులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వార్తాపత్రిక



కీ॥శే॥ కోడూరు వేంకటరమణారెడ్డి - శ్రీమతి శాంతమ్మ
పాపిరెడ్డిపాలెం

లాయర్ 45 YEARS

సాహిత్యానికి, సృజనాత్మకతకు వెలుగు దీపిక
పాఠకలోకానికి అద్వితీయమైన అక్షర కానుక

**లాయర్**
వార్తాపత్రిక

45 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా

**అభినందన ఆశీస్సులు.**



"పద్మభూషణ్"
**డా॥ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి**
ఫౌండర్ చైర్మెన్
శాంతా బయోటెక్నిక్స్

లాయర్
జూన్ 26, 2026

# మరణమృదంగం మోగిస్తున్న.. కుటుంబ కలహాలు!

నేటి ఆధునిక సమాజంలో నానాటికీ బంధాలు-అనుబంధాలు, అభిమానాలు, ఆత్మీయతలు, ప్రేమానురాగాలు అన్నీ కనుమరుగైపోతున్నాయి. చివరికి తల్లితండ్రులు-బిడ్డల మధ్య కూడా అంతరాలు పెరిగిపోతున్నాయి. అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లల్నే తమ చేతులతోనే హతమార్చుకునే దయనీయ పరిస్థితులు సమాజాన్ని కన్నీరు పెట్టిస్తున్నాయి. కొన్ని సంఘటనల్లో కుటుంబ కలహాలు మరణమృదంగాన్నే మోగిస్తున్నాయి. ఇటీవలికాలంలో స్వార్థం, ధనాశ పెరిగిపోయి, దేశవ్యాప్తంగా అనేక కుటుంబాల్లో అశాంతి తప్ప ప్రశాంతత ఉండడం లేదు. భార్యాభర్తలు కూడా ఒకరినొకరు సరిగా అర్థం చేసుకోవడం లేదు.. మనస్పర్థలు, ఘర్షణలు, ఒకరిపై మరొకరికి లేనిపోని అనుమానాలు వంటివన్నీ పెరిగిపోతున్నాయి. ప్రేమానురాగాలకు ప్రతీకలుగా ఉండాల్సిన భార్యాభర్తల మధ్య కలహాలు ముదిరిపోయి చివరికి ఒకరినొకరు చంపుకోవడమో, లేక ఎవరికి వారు ఆత్మహత్యలు చేసుకోవడమో కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో, కొందరు తమ పిల్లలు ఏమైపోతారోననే భయంతో వారిని కూడా చంపేసి, తామూ చచ్చిపోతుండడం మరింత దారుణం.. దయనీయం!. క్షణికావేశంలో తామేం చేస్తున్నామో కూడా ఆలోచించకుండా, జీవితంపై విరక్తితో ప్రాణాలు తీసేసుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలెన్నో తరచూ జరుగుతూనే ఉన్నాయి కూడా. మొన్నటికి మొన్న ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం కెవి అగ్రహారంలో ఒక తండ్రి, 9, 10, 13 ఏళ్ల లోపు వయసున్న తమ ముగ్గురు కుమార్తెలకు విషమిచ్చి చంపేసి, తాను ఓ చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. కుటుంబ కలహాలే ఈ దుర్ఘటనకు కారణమని స్థానికులు భావిస్తున్నారు. అదేరోజున శ్రీకాకుళం జిల్లా పలాస గ్రామం వద్ద ఒక తల్లి తన ఇద్దరు బిడ్డలను మృత్యువుకు అప్పగించి, తానూ ఆత్మహత్యకి పాల్పడింది. ఏడేళ్ళ కొడుకు, ఆరేళ్ల కూతురు ఈ దుర్ఘటనకు తల్లితో పాటు బలైపోయారు. దీనికి కూడా భార్యాభర్తల మధ్య గొడవలే ప్రధాన కారణమంటున్నారు. ఆఘటనలో నలుగురు, ఇక్కడ ముగ్గురు ఒకేసారి కడతేరిపోయారు. ఈ విషాదాలు ఆయా కుటుంబాలను శోకసముద్రంలో ముంచివేశాయి. అయినా, కుటుంబమన్నాక కష్టనష్టాలెన్నో ఉంటాయి. అంత మాత్రానికే చావుదాకా ఆలోచించడం దారుణం. కాపురాల్లో జగడాలు మామూలే. కేవలం సంతోషాలే కాదు.. సమస్యలూ ఉంటాయి. ఆలోచనల్లో తేడాలు భార్యాభర్తల మధ్య సహజంగానే వస్తుంటాయి.. పోతుంటాయి. కష్టసుఖాలన్నవి వెలుగు నీడల్లా వస్తూనే ఉంటాయి. సంసారంలో ఎదురయ్యే ఎన్ని ఇబ్బందులనైనా భార్యాభర్తలిద్దరూ ఆత్మవిశ్వాసంతో అధిగమించాలి. మంచి ఆలోచనలతో కుటుంబాన్ని చక్కదిద్దుకోవాలి. ప్రతి సమస్యకీ పరిష్కారం ఉండనే ఉంటుంది. విద్యావంతులు, వివేకవంతులు, పెద్దలైన తల్లి తండ్రులు సమాజంలో ఎందరో ఉన్నారు. కష్టం వచ్చినప్పుడు ఎలా గట్టెక్కాలో వారి సలహాలు అడగాలి. అవసరమైతే నిపుణుల కౌన్సిలింగ్ తీసుకోవాలి. విజ్ఞతతో వ్యవహరించి కష్టాల సుడిగుండాల నుంచి కుటుంబాలను ఒడ్డుకు చేర్చుకోవాలి. అదే ధీరవంతుల లక్షణం. అంతేకానీ, ఆత్మహత్య అన్నది ఏ సమస్యకీ, ఏనాటికీ పరిష్కారం కానే కాదన్నది గుర్తుంచుకోవాలి. భగవంతుడు మనకిచ్చిన మానవజన్మని చివరిదాకా కొనసాగించాలి. జీవితం ఉన్నది జీవించడానికే కానీ, మరణించడానికి కాదన్న సత్యాన్ని గ్రహించాలి. మనకన్నా ఈ ప్రపంచంలో ఇంకా ఎందరో నిర్భాగ్యులు, అసహాయులు, దీనులు.. దివ్యాంగులెందరో అనేక బాధల్లో ఉన్నా, అన్నిటినీ భరిస్తూనే జీవిస్తున్నారని, సమాజంలో ఉన్నతస్థాయిని అందుకునేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని కూడా తెలుసుకోవాలి. భార్యాభర్తలు కలహాలకు కాలుదువ్వకుండా, తమ కుటుంబాలను నాశనం చేసుకోకుండా.. తామే తెలివిగా సమస్యలను పరిష్కరించుకోవాలి. ఎవరైనా సరే, సమున్నత లక్ష్యాలతో జీవించి.. అందరికీ మార్గదర్శకంగా ఉంటూ జన్మని సార్థకం చేసుకోవాలే కానీ, అర్ధాంతరంగా జీవితాన్ని ముగించడం పిరికితనం తప్ప మరొకటి కాదు. ఆత్మహత్యలు, హత్యలు వంటివి నేరాలే కాదు, ఘోరమైన పాపాలు కూడా. ఇకనైనా.. క్షణికావేశం వీడండి. సహనం.. సంయమనం పాటించండి.. చీకటి తర్వాత వెలుగు ఉండనే ఉంటుంది. కష్టాల తర్వాత సుఖాలూ వస్తాయి. అదిగో అటుచూడండి. ఇది రాత్రి!.. భయంకరమైన చీకటి..కొంతసేపటి తర్వాత వేకువ వెలుగు వస్తుంది. సూర్యోదయమైతే చీకటి పటాపంచలవుతుంది. ఈలోగా నిర్వేదం.. నిరాశ వద్దనే వద్దు!.. వివేకంతో కళ్ళు తెరిస్తే చాలు.. చీకట్లన్నీ తొలగిపోయి..మన జీవితాల్లోనూ వెలుగులు వికసిస్తాయి!.. మంచి ఆలోచనలతో జీవిస్తేచాలు.. అన్ని ఉషోదయాలూ మనవెంటే ఉంటాయి!...

# తమిళనాడు సీఎం విజయ్ నిర్ణయం సాహసోపేతం.. అభినందనీయం!




గత డీఎంకే ప్రభుత్వ హయాంలో ఆలయాల నిధులను ప్రభుత్వ పథకాలకు మళ్లించిన 40కి పైగా జీవోలని రద్దు చేస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీసుకున్న నిర్ణయం అత్యంత సాహసోపేతం అభినందనీయం కూడా. “ఆలయాల సొమ్ము ఆలయాలకే” అని ఆయన స్పష్టం చేయడం హర్షణీయం. భక్తులు హుండీలో వేసే కానుకలు దేవుడి సేవకు, అన్నదానానికి, వేద పాఠశాలలు, గోశాలల అభివృద్ధికే తప్ప ప్రభుత్వ పథకాలకు కాదు. గతంలో రూ. 2,300 కోట్లకుపైగా ఆలయ నిధులను కొన్ని ప్రభుత్వ పథకాలకు మళ్లించిన జీవోలను సీఎం విజయ్ రద్దుచేయడం భక్తుల విశ్వాసానికి ఆయన ఇచ్చిన గౌరవం. హిందూ ధార్మిక సంస్థల చట్టం సెక్షన్ 66 ప్రకారం ట్రస్ట్ సొమ్మును ఆలయ ప్రయోజనాలకు మాత్రమే వాడాలి. రద్దు చేసిన పథకాల ఉత్తర్వులు చట్ట విరుద్ధమని న్యాయ నిపుణులు సైతం గతంలో అభిప్రాయపడ్డారు. సీఎం విజయ్ నిర్ణయం చట్టాన్ని, ధర్మాన్ని నిలబెట్టింది. పేదలకు సంక్షేమ పథకాలు అవసరమే. కానీ వాటికి బడ్జెట్ నుంచి నిధులు కేటాయించాలి. అంతే తప్ప ఆలయ హుండీ సొమ్ము వాడడం సరికాదని విజయ్ తేల్చిచెప్పారు. దీనివల్ల పథకాలు ఆగవు – వాటికి సరైన ఆర్థిక వనరులు వెతకాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. మన రాష్ట్రాల్లోనూ టీటీడీ, శ్రీశైలం, సింహాచలం వంటి ఆలయాల నిధులను ఇతర అవసరాలకు వాడిన సందర్భాలున్నాయి. తమిళనాడు తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ఆదర్శం కావాలి. భక్తుల సొమ్ముకు రక్షణ కల్పిస్తూ, రద్దు చేసిన పథకాల జీవోల స్థానంలో ఆలయ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాలకు నిధులు మళ్లిస్తామని ప్రకటించిన సీఎం విజయ్‌కు అభినందనలు. ఇది రాజకీయాలకు అతీతంగా అందరూ ఆమోదించాల్సిన చర్య.

లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.

## హెల్మెట్ పెట్టుకోకుంటే ప్రమాదమే

ఇటీవల మన నెల్లూరుజిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. కేవలం నెలరోజుల్లోనే సుమారు 17 మంది ఈ ప్రమాదాల్లో మరణించినట్లు పత్రికల్లో వార్తలు చూసి ఎంతో బాధ కలుగుతోంది. ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో తలకు గాయాలై మృత్యువాతపడుతున్నారు. హెల్మెట్ పెట్టుకుంటే ఎంతో మంచిదని పోలీసులు చెప్తున్నా పట్టించుకోకపోతే ఎలా?..

సి.జయభార్గవ్, కావలి.

## సిటీబస్సులను పెంచాలి

నెల్లూరు నగరంలోని చాలా ప్రాంతాలకు ఆటోలు తప్ప మరో మార్గాంతరం ఉండడం లేదు. రైల్వేస్టేషన్ వద్ద నుంచి దర్గామిట్టకో, వేదాయపాళెంకో వెళ్లాలంటే రాత్రి వేళల్లో కనీసం రెండువందలు పెట్టాల్సి ఉంటోంది. నగరాల్లో బస్‌స్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌ల వద్ద నుంచి సిటీబస్సుల సౌకర్యం ఉంటుంది. నెల్లూరులో మాత్రం కనీసం రంగనాయకుడి గుడి దాకా కూడా సిటీబస్సులు ఉండడం లేదు. ఏళ్లతరబడిగా ఈ దుస్థితిలో మార్పు రావడంలేదు. ఆర్టీసీవారు ఇకనైనా నగరంలోని ప్రధాన ప్రాంతాలకు సిటీ బస్సులు నడిపితే బాగుంటుంది!..

– జె.పార్వతమ్మ, బాలాజీనగర్.

# తరాల ముద్రలు.. తెర వెనుక కుట్రలు!




సమాజంలో ఎప్పుడు ఏ ఆందోళన వచ్చినా, ఏ సామాజిక ఉద్యమమైనా లేదా నిరసన వ్యక్తమైనా అది ఒక నిర్దిష్టమైన సమస్య నుంచి, ఒక ప్రత్యేకమైన చారిత్రక సందర్భం నుంచి మాత్రమే పుడుతుంది. అలాంటప్పుడు దాన్ని ఆ సమస్య కోణంలోనే విశ్లేషించాలి తప్ప, ఆ ఘటనను సాకుగా తీసుకుని ఒక తరం మొత్తాన్ని ఒకే బోనులో నిలబెడుతూ ‘జెన్–జీ’ (Gen -Z) వంటి ఆంగ్ల అక్షరాల ముద్రలు వేయడం అత్యంత ప్రమాదకరం, పూర్తిగా అర్థరహితం. ఈ ట్యాగింగ్ సంస్కృతి అనేది కేవలం పాత తరం వారు కొత్త తరాన్ని అర్థం చేసుకోలేక, వారి మధ్య ఉన్న సహజమైన ఆలోచనా అంతరం వల్ల వేస్తున్న ముద్రలు కావు. దీని వెనుక మీడియాలోని ఒక వర్గం అత్యుత్సాహంతోనో, లేదా తెర వెనుక ఉండి సమాజ గమనాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూసే ‘డీప్ స్టేట్’ (Deep State) వంటి కొన్ని అదృశ్య శక్తులు కావాలని నడిపిస్తున్న ఒక పెద్ద వ్యూహాత్మక ఎజెండానో దాగి ఉంది. వివిధ తరాల మధ్య కృత్రిమమైన అంతరాన్ని సృష్టించి, ఆ తరం యువతను మిగిలిన సమాజం నుంచి వేరుచేసి, వ్యవస్థలో తీవ్రమైన చీలికలు తేవడమే ఈ తెర వెనుక శక్తుల అసలైన లక్ష్యమని మనం గ్రహించాలి.

సమాజశాస్త్ర కోణంలో అత్యంత లోతుగా పరిశీలిస్తే, ఒకే వయస్సు పరిధిలో ఉన్న తరం మొత్తానికి ఒకే రకమైన అభిప్రాయం ఉంటుంది అని అనుకోవడం ఒక పెద్ద సామాజిక భ్రమ. ‘జెన్–జీ’ అని మనం పిలిచే వయస్సు పరిధిలో ఈనాడు దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువతీ యువకులు నివసిస్తున్నారు. వారి సామాజిక, ఆర్థిక, ప్రాంతీయ, సాంస్కృతిక నేపథ్యాలు ఒకదానికొకటి పూర్తిగా భిన్నమైనవి. ఒక మహానగరంలో ఉంటూ అత్యాధునిక సాంకేతిక వాతావరణంలో పెరిగే ఒక ఐటీ ఉద్యోగి ఆలోచనలు, లేదా ఒక గ్రామీణ ప్రాంతంలో ఉంటూ వ్యవసాయం, ఇతర అనుబంధ పరిశ్రమలపై ఆధారపడే యువత ఆలోచనలు, లేదా కళాశాల విద్యార్థి ఆలోచనలు ఎప్పటికీ ఒకటి కావు. ఒక నిర్దిష్ట సమస్యపై ఒక తరంలోని ఒక చిన్న వర్గం మాత్రమే స్పందించినప్పుడు, ఆ స్పందనను లేదా ఆ ఆందోళనను ఆ ఒక్క విషయానికే పరిమితం చేసి చూడాలి. కానీ, ఆ చిన్న వర్గం యొక్క తీవ్రమైన ఆలోచనలను లేదా విపరీత ధోరణులను ఉదాహరణగా చూపిస్తూ, యావత్ తరం అంతా అలాగే ఆలోచిస్తోందని ముద్ర వేయడం మేధోపరమైన మోసం మాత్రమే అవుతుంది.

ఉదాహరణకు, ఇటీవల సోషల్ మీడియా వేదికలపై ‘కాక్‌రోచ్ పార్టీ’ పేరుతో ఒక యువకుడు మొదలుపెట్టిన ప్రచారాన్ని మనం ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించవచ్చు. దానికి కొన్ని వేలమంది లేదా కొన్ని లక్షలమంది ఫాలోవర్లు ఉన్నంత మాత్రాన, దేశంలోని కోట్ల మంది యువతరం అంతా అతని ఆలోచనలను సమర్థించినట్లు ఎంతమాత్రం కాదు. వాస్తవానికి భారతదేశంలోని మెజారిటీ యువత ఆ రకమైన ఆలోచనలను అస్సలు సమర్థించడం లేదు. నిరాకరిస్తోంది కూడా. కానీ, ప్రధాన స్రవంతి మీడియాలో ఒక వర్గం, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఆ ఒక్క చిన్న అంశాన్ని భూతద్దంలో చూపిస్తూ, దాన్నే ఒక పెద్ద సామాజిక ట్రెండ్‌గా చిత్రీకరిస్తున్నారు. ఈ విధమైన అంతర్గత వైరుధ్యం సమాజంలో ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. ఒక చిన్న వర్గం చేసే ఆందోళనలను, హంగామాను చూసి, మొత్తం తరం అంతా అదే దారిలో ఉందనే ఒక తప్పుడు చిత్రాన్ని సమాజంపై బలవంతంగా రుద్దుతున్నారు. ఇలా ముద్రలు వేయడం వెనుక ఒక స్పష్టమైన, దీర్ఘకాలిక ప్రచార వ్యూహం ఉంటుంది.

అసలు నిశ్శబ్దంగా ఉంటూ, తమ పని తాము చేసుకుపోయే మిగిలిన మెజారిటీ యువతను కూడా మానసికంగా లోబరుచుకుని ప్రభావితం చేసే ప్రయత్నమే ఇదంతా. “మీ తరానికి చెందిన వారంతా ఇలాగే ఆలోచిస్తున్నారు, కాబట్టి నువ్వు కూడా ఇలాగే ఆలోచించాలి. లేదంటే వెనకబడిపోతావ్” అనే ఒక పరోక్షమైన సామాజిక ఒత్తిడిని సృష్టించడమే దీని వెనుక ఉన్న అసలైన వ్యూహం. ఇలాంటి అధునాతన మైండ్ గేమ్స్ లేదా సామాజిక వ్యూహాల వల్ల కొంతమంది అమాయక యువకులు తాత్కాలికంగా ప్రభావితం అవుతారేమో కానీ, యావత్ దేశ యువత యొక్క సహజ స్వభావాన్ని ఇది మార్చలేదు. క్షేత్రస్థాయిలో యువత ఆలోచనలు ఎప్పుడూ స్వతంత్రంగా, వివేచనతోనే ఉంటాయి.

పుట్టిన సంవత్సరాన్ని బట్టి వారికి ఇంగ్లీష్ అక్షరాల ముద్రలు వేయడం అంటే ప్రవహించే నదికి సరిహద్దులు పెట్టాలని చూడడమే. యువత ఎప్పుడూ యువతే– వారు సమాజ పరిణామ క్రమానికి ఇంధనాలు.

చివరిగా చెప్పాలంటే, యువత ఎప్పుడూ ఒకే మూసలో బందీలు అయ్యే నిర్జీవమైన సమూహం కాదు. సమస్యల ఆధారంగా, తమ సొంత విచక్షణతో స్పందించే యువతను ఒక అక్షరంలోనో, ఒక పదంలోనో ముద్రవేసి విభజించాలనుకోవడం అసాధ్యం. చరిత్రలో ప్రతి తరం యువతరంగా ఉన్నప్పుడు ఒక ప్రత్యేకమైన ఆవేశాన్ని, దూకుడును ప్రదర్శించింది. ‘జెన్–జీ’ అని ముద్ర వేస్తున్న నేటి యువతరంలోని ఒక వర్గం నిశ్శబ్దమై బాధ్యతల వలయంలోకి జారుకున్నప్పుడు, ‘జెన్–ఆల్ఫా’ అదే ఆవేశంతో ముందుకొస్తుంది. కాబట్టి, తెర వెనుక శక్తులు సృష్టించే ఈ ట్యాగింగ్ ఎజెండాలను పక్కనపెట్టి, యువతను యువతగా చూడాలి. వారిలో ప్రతి ఒక్కరూ చెప్పిన విషయాలను వినాలి, అర్థం చేసుకోవాలి.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# ఆలయాల భద్రతకు పటిష్ట చర్యలు!

## - దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి




రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే దేవాదాయ ధర్మాదాయ శాఖను సంపూర్ణంగా ప్రక్షాళన చేసి, ఏపీని నూతన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దామని, దేవాలయాల భద్రతకు ఆస్తుల రక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అమరావతి లోని సచివాలయంలో ఇటీవల ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఆనం మాట్లాడుతూ, ఆలయాల భద్రత, ఆస్తుల రక్షణకు డీజీపీ, కలెక్టర్లతో కూడిన హైపవర్ కమిటీలు వేశామని, ఆలయాల రక్షణలో పోలీసు శాఖ నిరంతర పర్యవేక్షణ, రక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. చిన్న ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు.

**తిరుమలలో క్యూలైన్ల నిర్వహణకు..**

**'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'**

తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రవేశపెట్టిన వినూత్న సంస్కరణలను మంత్రి ఆనం ఈ సందర్భంగా వివరించారు. క్యూ లైన్ల నిర్వహణ, భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, పారిశుధ్య పర్యవేక్షణ కోసం టీటీడీలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మెరుగైన నిర్వహణ వల్ల మే 2026 మాసంలో రికార్డు స్థాయిలో ఏకంగా 25 లక్షల 46 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని, ఇది టీటీడీ చరిత్రలోనే ఆల్ టైం రికార్డు అనిచెప్పారు. దేవాదాయ శాఖలో సుదీర్ఘకాలంగా ఉన్న ప్రమోషన్ల ప్రక్రియను పూర్తి చేసి, ఖాళీగా ఉన్న 342 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రక్షాళన చర్యల వల్ల నేడు రాష్ట్రంలోని 22 ప్రధాన ఆలయాల వార్షిక ఆదాయం రూ. 182 కోట్ల రూపాయల నుండి రూ. 239 కోట్ల రూపాయలకు పెరిగిందని మంత్రి వెల్లడించారు.

# వైసీపీ డ్రామాలను జనం నమ్మరు



మంత్రి నారాయణ

నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు నోటీసులు ఇస్తే వైఎస్ఆర్సీపీ నేతలు రోడ్డెక్కి వీధి నాటకాలు వేయడం సిగ్గుచేటని, ఇలాంటి రాజకీయ డ్రామాలను జనం నమ్మరని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరులో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి కాలేజీకి నోటీసులు ఇవ్వడంపై జరుగుతున్న రాద్ధాంతంపై ఆయన మాట్లాడుతూ, అసలు ఆ నోటీసుల వ్యవహారం తనకు తెలియనే తెలియదని, మొన్న భీమవరంలో తమ నారాయణ విద్యాసంస్థలకు కూడా అధికారులు నోటీసులు ఇచ్చారని, ఆ విషయాన్ని తన వియ్యంకుడు గంటా శ్రీనివాసరావు ఫోన్ చేసి చెబితేనే తనకు తెలిసిందని వెల్లడించారు. ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సరిచేసుకోవాలి తప్ప రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన అవసరం లేదన్నారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో కక్షగట్టి నారాయణ గ్రూప్‌ను రకరకాలుగా వేధించిన సంగతులను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వ్యాపారస్తులను, విద్యాసంస్థలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టదని, ఎవరిపైనా కక్షపూరితంగా వ్యవహరించదని స్పష్టం చేశారు.






# రైతుల సంక్షేమానికే.. ప్రభుత్వ ప్రాధాన్యత



లబ్ధిదారులకు 'అన్నదాత సుఖీభవ' చెక్కును అందజేస్తున్న మంత్రి ఆనం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వారి సంక్షేమానికి అగ్రతాంబూలం వేస్తూ ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఎలాంటి రాజీపడడం లేదని మంత్రి ఆనం స్పష్టం చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధుల విడుదల సందర్భంగా ఇటీవల ఆత్మకూరు మండలం వాసిలి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులతో మంత్రి మాట్లాడుతూ ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద రూ.5,000, పీఎం కిసాన్ కింద రూ.2,000 చొప్పున మొత్తం రూ.7,000 జమ అయ్యిందన్నారు. నెల్లూరు జిల్లాలో 1,77,545 మంది రైతులకు రూ.117.16 కోట్లు, ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 34,223 మంది రైతులకు రూ.22.84 కోట్ల లబ్ది చేకూరిందని వెల్లడించారు.




# నెల్లూరు కబుర్లు

## యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

**- కలెక్టర్ హిమాన్షు శుక్ల**



చిన్నారులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, యోగాను ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని, ప్రతిరోజు యోగ సాధన చేసి ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించుకుందామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో జేసి మొగిలి వెంకటేశ్వర్లుతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా, యోగా పోటీలలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారితో పాటు యోగా గురువులను, యోగాసనాలను సాధనం చేసిన చిన్నారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అభినందించి సన్మానించారు. నగర మేయర్ సుజాత, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి, యోగాంధ్ర జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత, స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయూమ్ పాల్గొన్నారు.

## ఆత్మహత్యల నివారణపై.. అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

మహిళల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న డీసీఆర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఈనెల 23న విద్యార్థులు, విద్యార్థినులకు అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీఆర్ జడ్పీ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, బాలికలు జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసం కోల్పోరాదని సూచించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగానికి చెందిన సిహెచ్ సమత, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్ణయాలపై.. ఎన్జీఓల హర్షం

ఈనెల 22న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల పట్ల ఎన్జీఓల సంఘం నాయకులు హర్షం ప్రకటించారు. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు మరియు గురుకుల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచడం రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎంతో సంతోషకరమైన విషయమని ఏపీ జేఏసీ మరియు ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా పక్షాన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆ సంఘం జిల్లా జేఏసి చైర్మెన్ బండారుపల్లి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, విద్యామంత్రి నారా లోకేష్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

### రొట్టెల పండుగ భద్రతా ఏర్పాట్లపై..

## జిల్లా ఎస్పీ సమీక్ష



రొట్టెల పండుగ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జిల్లా ఎస్పీ అజితా వేజెండ్ల

ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు జరుగనున్న రొట్టెల పండుగ భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఈనెల 23న జిల్లా పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా, కులమతాలకు అతీతంగా బారాషహీద్ దర్గాకు దేశవిదేశాల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. దర్గాప్రాంగణంలో కంట్రోల్ కమాండ్ సిస్టం ఏర్పాటుచేసి నిరంతర పర్యవేక్షణ, డ్రోన్ సర్వేలెన్స్ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన భక్తులకు తగు సాయం చేయాలన్నారు. 27వ తేదీ రాత్రి జరిగే గంధమహోత్సవంలో బందోబస్తు కట్టుదిట్టంగా ఉండాలన్నారు. అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్యతో పాటు పలు స్టేషన్‌లకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## 'పాత ఉపాధి హామీ'నే అమలుచెయ్యాలి



ఆర్డీవోకి వినతిపత్రం సమర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

కేంద్రప్రభుత్వం కొత్తగా చేపట్టిన వీబీజీ రాంజీ పథకం వద్దనే వద్దని, పాత ఉపాధి హామీ చట్టాన్నే అమలుచేయాలని కోరుతూ భారత్ ఖేత్ మజ్దూర్‌యూనియన్ జాతీయసమితి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త పిలుపు మేరకు నెల్లూరులో ఆ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఇటీవల ఆందోళన నిర్వహించారు. కొత్త చట్టం వల్ల పేదలకు అన్యాయం జరుగుతుందని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లీలామోహన్ అన్నారు. ఉపాధి హామీ నిధుల్లో ఏపీకి భారీగా కోత విధిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఉపాధిహామీ కార్మికులను అన్నివిధాలా ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఆమేరకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, నాయకులు ముక్తియార్, షేక్ అజీజ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలతో అనర్థాలు

మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాల (డ్రగ్స్)కి విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని, మత్తుకు బానిసలైతే భవిష్యత్ ఉండదని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు (ఆర్ఐఓ) విద్యార్థులను హెచ్చరించారు. ఈనెల 23న నెల్లూరులోని జీవీఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్‌కి అలవాటుపడితే విచక్షణాజ్ఞానం కోల్పోతారని, చివరికి జీవితం అంధకారమేనని స్పష్టం చేశారు. దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ మహమ్మద్ అయూబ్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఏబీ రవికుమార్, వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివ రావు, జాయింట్ సెక్రటరీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగసంఘాల ధర్నా

రాష్ట్రప్రభుత్వం జారీచేసిన జీఓ నం. 88ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ నెల్లూరులోని ఆర్టీసీ రెండో డిపో గ్యారేజ్ గేట్ల వద్ద ఆర్టీసీ ఉద్యోగులు ఈనెల 23న ధర్నా నిర్వహించారు. విద్యుత్‌బస్సుల ఏర్పాటులో భాగంగా, విడుదల చేసిన ఈ జీఓతో క్రమేణా ఆర్టీసీలోని అన్ని డీజల్ బస్సులను రద్దుచేయాలనుకోవడం దారుణమని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.



## 14 మంది వైద్యులకు నియామక పత్రాలు

వైద్యులు అంకితభావంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. జిల్లా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎంపికైన 14 మంది వైద్యులకు జిల్లా కలెక్టర్ ఈనెల 22న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నియామక పత్రాలను అందజేశారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఆదేశాల మేరకు నిర్వహించిన వాక్-ఇన్ రిక్రూట్మెంట్ ప్రక్రియ ద్వారా అభ్యర్థుల ఎంపిక పూర్తిచేయడం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎంపిక కమిటీ ఆమోదంతో మొత్తం 8 మంది జనరల్ ఎంబీబీఎస్ వైద్యులు, 6గురు స్పెషలిస్ట్ వైద్యులు ఎంపికై నియామక పత్రాలు పొందినట్లు పేర్కొన్నారు. జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ డా. ఎ.కె.పరిమళ తదితరులు పాల్గొన్నారు.

### రెయిన్‌బో పాఠశాలని సందర్శించిన..

## సౌరశాస్త్రవేత్త చేతన్‌సింగ్ సోలంకి



పాఠశాలలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చేతన్‌సింగ్ సోలంకి

ప్రముఖ సౌరశాస్త్రవేత్త, సోలార్‌మ్యాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందిన బొంబాయికి చెందిన ప్రొఫెసర్ చేతన్‌సింగ్ సోలంకి ఇటీవల తన ఎనర్జీ స్వరాజ్ యాత్రలో భాగంగా, నెల్లూరు రూరల్ మండలంలోని రెయిన్‌బో సిబీఎస్ఇ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశమిస్తూ,, మనవద్ద ఉన్న పరిమిత ఇంధన వనరులను పొదుపుగా వాడుకోవాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇంధన వనరులను పొదుపు చేసుకుని భవిష్యత్‌తరాలకు అందరూ మార్గదర్శకం కావాలన్నారు. రెయిన్‌బో పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రొఫెసర్ సోలంకి లక్ష్యాలను వివరించారు. వారు స్థాపించిన ఎనర్జీ ఫౌండేషన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలు, సంస్థల ద్వారా తన ఆశయాలను ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. తమ పాఠశాల నుంచి కూడా రాబోయే రోజుల్లో ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు తయారుకావాలన్నదే తమ లక్ష్యమని ఆమె వివరించారు. రెయిన్‌బో ప్రిన్సిపాల్ అరుణ స్వయంప్రభ, అనీ గోప కుమార్, బిందియా జీనా తదితరులు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియో..28 నుంచి

చిన్నారులకు పల్స్‌పోలియో కార్యక్రమం ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించేందుకు జిల్లా ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ఆమేరకు ఇటీవల కలెక్టరేట్‌లో జల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ సుజాత, తదితర అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో 0-5 గల వయసు పిల్లలు 2,67,750 మంది ఉన్నట్లు గుర్తించామని, వారందరికీ పోలియో చుక్కలు వేయాలని అధికారులకు సూచించారు. అందుకు మొత్తం 7074 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. 1620 ఎన్ఐడి బూత్‌లు, 83 మొబైల్ యూనిట్లు, 88 ట్రాన్సిట్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## ఎస్ఐఆర్‌పై అవగాహన

కేంద్ర ఎన్నికలసంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించి సమగ్ర ఓటర్ జాబితాకి రూపకల్పనకు అందరూ సహకరించాలని నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ వైఓ నందన్ కోరారు. ఈనెల 23న నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్‌లో భాగంగా నెల్లూరు సిటీ నియోజకవర్గం రాజకీయ పార్టీల బూత్‌లెవల్ ఏజెంట్లకు స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో ఆయన అవగాహన కలిగించారు. అన్ని రాజకీయపార్టీల బీఎల్ఓలు తమ పరిధిలో ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియను నూరుశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన ప్రతిఒక్కరినీ ఓటరుగా చేర్చాలని స్పష్టం చేశారు.




## రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో..

# జిల్లా వాసులకి బహుమతులు



మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతులమీదుగా జ్ఞాపికలు అందుకుంటున్న నెల్లూరుజిల్లా విజేతలు

రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిని నిలబెట్టారు. సీనియర్, జూనియర్ యోగా విభాగాలలో పాల్గొని మూడు ప్రథమ బహుమతులు, ఒక ద్వితీయ బహుమతిని సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. సీనియర్ విభాగంలో కె. అనిల్ కుమార్‌రెడ్డి షార్ట్ ఫిల్మ్ కేటగిరీలో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించగా, ఎ.శ్రీనివాస్ పురుషుల సోలో యోగాసన విభాగంలో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి అందుకున్నాడు. అలాగే జి. కావ్యశ్రీ మహిళల సోలో యోగాసన విభాగంలో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించగా, జూనియర్ విభాగంలో ఎ. దివ్య మహిళల సోలో యోగాసన కేటగిరీలో రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి సాధించడం విశేషం. వీరికి రాష్ట్ర వైద్య ఆరోగ్యమంత్రి సత్యకుమార్‌యాదవ్ చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

# పార్లమెంట్ కమిటీ సమావేశంలో.. బీఎంఆర్



రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుయాదవ్ (బీఎంఆర్) ఈనెల 23న న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ అనెక్స్‌లో నిర్వహించిన కార్పొరేట్ లాస్ (సవరణ) బిల్లు–2026పై జరిగిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. వివిధ సంస్థల ప్రతిపాదనలు, అభిప్రాయాలను పరిశీలిస్తూ, కార్పొరేట్ రంగంలో పారదర్శకత, పెట్టుబడుల ప్రోత్సాహం, వ్యాపార సౌలభ్యం, దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడేవిధంగా చట్ట సవరణలపై చర్చల్లో పాల్గొన్నారు. దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసే దిశగా కార్పొరేట్ చట్టాల సవరణకు సంబంధించి కమిటీ సమగ్రంగా పరిశీలన కొనసాగిస్తోందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో.. జిల్లా సరికొత్త రికార్డు!

## • మంత్రి నారాయణ



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి నారాయణ, కలెక్టర్ హిమాన్షు శుక్ల

జిల్లాలో వచ్చిన అర్జీలలో 87 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ సమస్యల పరిష్కారం ఒక రికార్డుని సాధించిందని రాష్ట్ర పురపాలక మంత్రి డా.పొంగూరు నారాయణ అన్నారు. ఈనెల 22న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి నేటి వరకు నెల్లూరు జిల్లావ్యాప్తంగా మొత్తం 82,166 గ్రీవెన్స్ దరఖాస్తులు రాగా, అధికారులు రికార్డు స్థాయిలో 87 శాతం అంటే 71,549 అర్జీలను విజయవంతంగా పరిష్కరించారని వెల్లడించారు. పరిష్కారమైన వాటిలో కేవలం 5,384 మంది మాత్రమే సంతృప్తి చెందక మళ్లీ దరఖాస్తు చేసుకున్నారని, అర్జీలలో ఎక్కువగా 57శాతం ఒక్క రెవెన్యూ శాఖ నుంచే వస్తున్నాయని, ఆ విభాగంలోనూ 84 శాతం సమస్యలను ఇప్పటికే పరిష్కరించారని చెప్పారు.

# ‘యోగా’కి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని మోడీదే!



యోగాసనాలు వేస్తున్న మంత్రి నారాయణ, మున్సిపల్ కమిషనర్ నందన్

భారతీయ సంస్కృతి అయిన యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత మన ప్రధాని మోడీదేనని, ఇది భారతీయులందరికీ గర్వకారణమని రాష్ట్ర పురపాలక మంత్రి డా.పొంగూరు నారాయణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న నెల్లూరు గాంధీ బొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్క్‌లో అదివారం జరిగిన యోగా వేడుకల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొని యోగాసనాలు సాధన చేశారు. వాకర్స్, కరాటే విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని సచివాలయాల్లో యోగా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం చేకూరుతుందని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్ర, దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. స్థానికులకు ప్రతిరోజూ యోగా నేర్పిస్తున్న ట్రైనర్ విక్రమ్‌ను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, అదనపు కమిషనర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.




ఉత్తరక్రియలు

ఆత్మీయమూర్తి, అనురాగదీప్తి,
ప్రకృతి ప్రేమికురాలు, పర్యావరణ పరిరక్షకురాలు,
మా ఇంటి దేవత
శ్రీమతి శనగవరపు జయలక్ష్మి గారు
తేది. 19.6.2026 శుక్రవారం స్వర్గస్తురాలైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భర్త :
డా॥ శనగవరపు సత్యనారాయణమూర్తి
కుమార్తెలు - అల్లుళ్ళు
దీప - డా॥ ఎం.వి.రామమోహన్
డా॥ శ్వేత - డా॥ సి.ప్రేమదీప్
మనుమలు, మనుమరాండ్రు
విష్ణు, విహాన్
ఐష్వి, అయాన్ష్

వారి ఉత్తరక్రియలు: తేది. 27.6.2026 శనివారం నుండి తేది. 30.6.2026 మంగళవారం వరకు నెల్లూరు, బాలాజీనగర్ సెంటర్, మినీబైపాస్‌రోడ్డు, పెట్రోల్ బంకు పక్కన కాశీ విశ్వేశ్వర సత్రం నందు జరుగును. కావున బంధుమిత్రులకి తెలియజేయడమైనది.

# యోగాతో మానసిక వికాసం

## - - - ఎన్‌బీకేఆర్‌లో యోగా శిక్షణ - - -



ఒత్తిడి, ఆందోళనలను అధిగమించడంలో యోగా కీలకపాత్ర పోషిస్తుందని, యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత మరియు వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతాయని ప్రముఖ యోగా శిక్షకురాలు ఎ.రామాభాగ్య తెలిపారు. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ)లో ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కళాశాల వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామం మరియు ధ్యాన విధానాలపై ప్రాయోగిక శిక్షణ అందించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఎదుర్కొనే వత్తిడిని అధిగమించేందుకు యోగా దివ్యసాధనం అని ఆమె తెలిపారు. వ్యాయామ విద్య విభాగాధిపతి డా. వి.మల్లికార్జునరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.శ్రీనివాసులు, కె.శోభారాణి, రామ్ కుమార్, ఇ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని విద్యార్థులతో కలిసి యోగా సాధన చేశారు.

### ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఒక మంచి సాధనమని, ప్రపంచానికి మనదేశం ఒక వరంగా యోగాను ప్రసాదించిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఓ.చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. కోఆర్డినేటర్ టి.రాజేష్, ఎన్‌సిసి అధికారి పనబాక శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ అధికారి డా.గాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకి శ్రీసిటీ చేయూత!

## ● రూ.43 లక్షలతో వసతుల కల్పన

శ్రీసిటీ ఫౌండేషన్ సమన్వయంతో శ్రీసిటీలోని చార్ట్ వీఆర్వీ, పార్విన్ ప్యాకేజింగ్, బెర్జిన్ పైప్స్ పరిశ్రమలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్) కార్యక్రమాల కింద సుమారు రూ.43 లక్షల వ్యయంతో నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయా సంస్థల ప్రతినిధులు ఇటీవల ప్రారంభించారు. వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న బాలురు, బాలికల మరుగుదొడ్ల నిర్మాణ పనులను చార్ట్ వీఆర్వీ పరిశ్రమ రూ.12 లక్షల వ్యయంతో పూర్తి చేసింది. ఈ వసతులను చార్ట్ వీఆర్వీ డైరెక్టర్ (మ్యానుఫ్యాక్చరింగ్) ప్రసంజిత్ చటోపాధ్యాయ, శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా, శ్రీసిటీలోని పార్విన్ ప్యాకేజింగ్ పరిశ్రమ రూ.18 లక్షల వ్యయంతో వరదయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల కోసం నూతన మరుగుదొడ్ల సముదాయం, త్రాగు నీటి షెడ్ నిర్మించింది. ఈ సదుపాయాలను శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి, పార్విన్ ప్యాకేజింగ్ ప్రొడక్షన్ హెడ్ అభిజిత్ సమక్షంలో ప్లాంట్ హెడ్ రాహుల్ నెర్కర్ ప్రారంభించారు. వరదయ్యపాలెం మండలం చెన్నవారిపాలెం మోడల్ ప్రాథమిక పాఠశాలలో బెర్జిన్ పైప్స్ పరిశ్రమ సుమారు రూ.10 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టింది. వాటిని శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషాసన్నారెడ్డి, బెర్జిన్ కంపెనీ ప్రతినిధులు సతీష్ రామచంద్రన్, అల్తాఫ్ ప్రారంభించారు. బెర్జిన్ పైప్స్ పరిశ్రమ చొరవతో మాదనపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న సమావేశ మందిరం (మల్టీ పర్పస్ హాల్) నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇందుకోసం ఆ సంస్థ సుమారు రూ.3 లక్షలు వ్యయం చేసింది. దీనిని కూడా కంపెనీ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పరిశ్రమల సీఎస్సార్ చర్యలను అభినందించారు.



మాదనపాలెం జడ్పీ హైస్కూల్లో సమావేశ మందిరం ప్రారంభిస్తున్న బెర్జిన్ పైప్స్ ప్రతినిధులు


### నూతన ఉద్యోగులకు నియామక పత్రాలు..

కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి వికసిత భారత్ రోజ్‌గార్ యోజన పథకం కింద ఎంపికైన నూతన ఉద్యోగులకు శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీ ఆడిటోరియంలో ఇటీవల నియామక పత్రాలను అందజేశారు. ఈ పథకం కింద 85 మందికి పైగా యువతకు ఉద్యోగాలు లభించగా, తొలివిడతగా 25 మందికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్, ట్రిపుల్ ఐటీ రిజిస్ట్రార్ డా. దివ్య బ్రహ్మం, తిరుపతి ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-2 సతీష్‌కుమార్, డిప్యూటీ లేబర్ కమిషనర్ సురేష్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

# గూడూరు డివిజన్

## పేదల పెన్నిధి.. సీఎం సహాయనిధి

### ఎమ్మెల్యే డాక్టర్ పాశిం




లబ్దిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్

అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద వారందరికీ సీఎం సహాయనిధి ద్వారా చెక్కులను అందిస్తున్నట్లు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ తెలిపారు. పలువురు లబ్దిదారులకు ఇటీవల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.57 లక్షలకు పైగా సీఎం సహాయనిధి చెక్కులను అందించామన్నారు. చిల్లకూరు మండలం రామారెడ్డిపాలెం గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కార్యకర్తల సంక్షేమనిధి క్రింద రూ.5లక్షల బీమా చెక్కును మృతుని కుటుంబసభ్యులకి అందజేశారు. నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, మట్టం శ్రావణి, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో సమస్యల పరిష్కారం

### - ఆర్డీవో అరుణకుమారి



ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

భూ సమస్యలు సకాలంలో పరిష్కరించేలా కృషి చేస్తామని గూడూరు ఆర్డీవో అరుణకుమారి తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై వినతులు అందజేశారు. కోట మండలం కొత్తపాలెం గ్రామంలో భూములను ఏపి ఐఐసీకి తీసుకొని పరిహారం అందించలేదని సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో రైతులు వినతిపత్రం అందజేశారు.



మంత్రి ఆనంకి బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రికను అందజేస్తున్న శ్రీకంటి రామమోహన్‌రావు, నాగేంద్ర, రవీంద్రబాబు

## ఆనంకి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక

గూడూరు రాజావీధిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుండి జూలై 4వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని, నెల్లూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, బ్రహ్మోత్సవాలకు రావాలంటూ దేవస్థాన ఛైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, ధర్మకర్తల మండలి సభ్యులు పర్వతాల నాగేంద్ర, కొమ్మా రవీంద్రబాబులు ఆహ్వాన పత్రికను అందజేశారు.

## న్యాయమూర్తుల యోగాసనాలు



యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, అడ్వకేట్లు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ గూడూరు జిల్లా కోర్టు ఆవరణంలో బార్ ప్రెసిడెంట్ సాయికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కోర్టులోని న్యాయమూర్తులు, అడ్వకేట్లు, ఇతర సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. యోగా సాధనతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కూడా కలుగుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏడవ అదనపు జిల్లా జడ్జి కె.వెంకట నాగపవన్, సబ్ జడ్జి రాజేష్, పిడిఎం మధుబాబు పాల్గొన్నారు.

## లిటిల్ ఏంజెల్స్‌లో యోగ డే




యోగాసనాలు వేస్తున్న లిటిల్ ఏంజెల్స్ విద్యార్థినీ విద్యార్థులు

గూడూరు, శారదానగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 20వ తేదీ పాఠశాల మైదాన ప్రాంగణంలో విద్యార్థులచే ముందస్తు యోగా డే వేడుకలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులచే పలు యోగాసనాలు వేయించి యోగ వలన కలిగే లాభాలను వివరించారు. కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ యోగ చేయడం వలన శారీరిక దృఢత్వంతో పాటు నిత్య ఆరోగ్యవంతులుగా ఉంటారని పేర్కొన్నారు. మానసిక ఒత్తిళ్లకు దూరంగా ఉంటూ ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు యోగ ఎంతో దోహదపడుతుందన్నారు. అకాడమిక్ డైరెక్టర్ సుధేష్ణ, పాఠశాల ప్రిన్సిపల్ నమఃశివాయ, హెడ్మాస్టర్ సురేష్, ఉపాధ్యాయినీఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నెలబల్లి దాతృత్వం




నెలబల్లి భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

గూడూరు రూరల్ పరిధిలోని నెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర నాయకులు, లయన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ నెలబల్లి భాస్కర్‌రెడ్డి దాతృత్వంతో 16వేల రూపాయల విలువచేసే విద్యార్థులకు అవసరమయ్యే ర్యాక్‌ను అందజేశారు. అనంతరం దాత భాస్కర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. క్లబ్ ప్రెసిడెంట్ అక్కన రమణయ్య, సెక్రటరీ ఆర్.రవిచంద్ర, ట్రెజరర్ వీరేంద్రనాథ్, హెచ్‌ఎం పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగం: 'ఏది వాస్తవం, ఏది అపోహ'?..

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

మన భారతీయ సమాజంలో ప్రభుత్వ ఉద్యోగం అనగానే ఒక ప్రత్యేక గౌరవం, ఒక భద్రతా భావం, ఒక స్థిరత్వం అనే మూడు భావాలు వెంటనే మనసులోకి వస్తాయి. "ప్రభుత్వ ఉద్యోగం అంటే పది తరాల భద్రత" అని పెద్దలు చెప్పిన మాటలు ఇంకా చాలా కుటుంబాల్లో వినిపిస్తూనే ఉన్నాయి. కానీ ఈ మాటల్లో ఎంత నిజం ఉంది, ఎంత అపోహ ఉంది అన్నది నేటి యువత తప్పనిసరిగా ఆలోచించాల్సిన విషయం. కాలం మారింది, అవకాశాలు మారాయి, ఉద్యోగాల స్వభావం కూడా మారింది. అయినా, మన మనసుల్లో మాత్రం పాత భావాలు బలంగా నిలిచే ఉన్నాయి. "అపోహలతో జీవించడం కన్నా నిజాలను తెలుసుకుని ముందుకు సాగడం మంచిది" అనే సూక్తి ఇక్కడ సరిగ్గా సరిపోతుంది.

భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగం అంటే ఒకప్పుడు నిజంగానే అరుదైన అవకాశం. ఉద్యోగాలు తక్కువ, పోటీ తక్కువ, జనాభా తక్కువ. ఒక ఉద్యోగం వస్తే అది కుటుంబానికి ఒక పెద్ద విజయంగా భావించేవారు. ఆ కాలంలో ప్రైవేట్ రంగం అంతగా అభివృద్ధి చెందలేదు. అందుకే ప్రభుత్వ ఉద్యోగం అంటే "ఒకసారి చేరితే జీవితాంతం భద్రత" అనే భావన బలపడింది. కానీ నేటి పరిస్థితి పూర్తిగా భిన్నం. ప్రైవేట్ రంగం విస్తరించింది, స్టార్టప్‌లు పెరిగాయి, టెక్నాలజీ రంగం ప్రపంచాన్ని మార్చేసింది. అయినా మనలో చాలామంది ఇంకా ప్రభుత్వ ఉద్యోగానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది తప్పు కాదు, కానీ అపోహల ఆధారంగా తీసుకునే నిర్ణయం మాత్రం తప్పు. ఉదాహరణకు, ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లలు ఉన్నారని అనుకుందాం. పెద్దవాడు ప్రభుత్వ ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి ప్రయత్నిస్తాడు. చిన్నవాడు ఈలోపు ఒక ప్రైవేట్ కంపెనీలో చేరి అనుభవం సంపాదిస్తాడు. ఐదేళ్ల తర్వాత చూస్తే చిన్నవాడు కెరీర్‌లో ముందుకు వెళ్లి ఉండవచ్చు, పెద్దవాడు ఇంకా పరీక్షల కోసం ప్రయత్నిస్తూ ఉండవచ్చు. ఇక్కడ ప్రశ్న ఏమిటంట..ఎవరు తప్పుచేశారని కాదు, ఎవరు తమ బలాలు, అవకాశాలు, కాలాన్ని సరిగ్గా అంచనా వేశారు అన్నది. "కాలమే ధనం" అనే లోకోక్తి ఇక్కడ అక్షరాలా నిజమవుతుంది.

**ప్రభుత్వ ఉద్యోగంలోనూ బాధ్యతలు పెరిగాయి :**

ప్రభుత్వ ఉద్యోగం అంటే పని తక్కువ, సౌకర్యాలు ఎక్కువ అనే అపోహ కూడా చాలా బలంగా ఉంది. ఇది పూర్తిగా నిజం కాదు. నేటి ప్రభుత్వ ఉద్యోగాల్లో బాధ్యతలు పెరిగాయి, పారదర్శకత పెరిగింది, పనితీరు అంచనా విధానాలు కూడా మారాయి. ఒక జిల్లా కలెక్టర్, ఒక పోలీస్ అధికారి, ఒక టీచర్, ఒక వైద్యుడు..వీరి పనిలో ఎంత ఒత్తిడి ఉంటుందో మనం బయటనుంచి అంచనా వేయలేం. ప్రభుత్వ ఉద్యోగం అంటే సులభంకాదు; అది కూడా ఒక సేవ, ఒక బాధ్యత, ఒక కర్తవ్యమే. ఇంకా ఒక అపోహ.. ప్రభుత్వ ఉద్యోగం మాత్రమే గౌరవం తెస్తుంది.. అని. ఇది కూడా కాలంచెల్లిన భావన. నేటి ప్రపంచంలో ఒకమంచి ఇంజనీర్, ఒక మంచి డాక్టర్, ఒక మంచి ఉపాధ్యాయుడు, ఒక మంచి వ్యాపారవేత్త, ఒక మంచి కళాకారుడు.. వీరందరూ సమాన గౌరవం పొందుతున్నారు. గౌరవం ఉద్యోగం వల్ల కాదు, మన పనితనం వల్ల వస్తుంది. "ఉద్యోగం చిన్నదైనా, పని గొప్పదై ఉండాలి" అనే లోకోక్తి మనకు గుర్తు చేస్తుంది. ఇక్కడ ఒక ముఖ్యమైన సందేశం యువతకు చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నించడం మంచిదే, కానీ జీవితాన్ని మొత్తం ఒకే పరీక్షకు అంకితం చేయడం మాత్రం మంచిది కాదు. మన దేశంలో లక్షలాది మంది యువత సంవత్సరాల తరబడి ఒకే పరీక్ష కోసం ప్రయత్నిస్తూ, తమ ప్రతిభను, సృజనాత్మకతను, అవకాశాలను కోల్పోతున్నారు. ప్రైవేట్ రంగం నేటి ప్రపంచంలో అపారమైన అవకాశాలను అందిస్తోంది. టెక్నాలజీ, ఫైనాన్స్, హెల్త్‌కేర్, ఎడ్యుకేషన్, డిజైన్, మీడియా, డేటా సైన్స్..ఏ రంగం చూసినా అవకాశాలు ఉన్నాయి. నైపుణ్యాలు ఉన్నవారికి ప్రపంచం తలుపులు తెరుస్తోంది. ఒక యువకుడు కోడింగ్‌లో బాగా ప్రతిభతో ఉన్నాడనుకుందాం. అతను ప్రభుత్వ ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి ప్రయత్నం చదమే మంచిదా, లేక తన నైపుణ్యాన్ని ఉపయోగించి టెక్ రంగంలో ముందుకు సాగడమే మంచిదా?..సమాధానం స్పష్టమే.

**ఉద్యోగాల స్వభావాలు మారుతున్నాయి :**

ఇంకా ఒక గొప్ప మార్గం.. ఉద్యమిత్వం (Entrepreneurship). మన దేశంలో స్టార్టప్‌లు ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నాయి. చిన్న ఆలోచనతో మొదలైన కంపెనీలు వేల మందికి ఉద్యోగాలు ఇస్తున్నాయి. ఒక యువకుడు తన సృజనాత్మకతను ఉపయోగించి ఒక చిన్న వ్యాపారం ప్రారంభిస్తే, అది అతని జీవితాన్నే కాదు, మరెందరి జీవితాలనో మార్చగలదు. ప్రభుత్వ ఉద్యోగం ఒక స్థిరత్వం ఇస్తుంది, కానీ ఉద్యమిత్వం ఒక స్వేచ్ఛను, ఒక సృజనాత్మకతను, ఒక ప్రభావాన్ని ఇస్తుంది. అమెరికా వంటి దేశాల్లో ప్రభుత్వ ఉద్యోగం అంటే మన దేశంలో ఉన్నంత క్రేజ్ ఉండదు. అక్కడ ప్రైవేట్ రంగం బలంగా ఉంటుంది, అవకాశాలు విస్తారంగా ఉంటాయి. మన దేశంలో మాత్రం ప్రభుత్వ ఉద్యోగం అంటే ఒక సామాజిక స్థాయి, ఒక కుటుంబ గౌరవం, ఒక భద్రతా భావం. ఈ భావనను తప్పు అనలేం, కానీ అది ఒక్కటే మార్గం కాదు అని మాత్రం చెప్పాలి. ప్రపంచం మారుతోంది, ఉద్యోగాల స్వభావం మారుతోంది, నైపుణ్యాల విలువ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో యువత అపోహల ఆధారంగా కాదు, నిజాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలి. నైపుణ్యాలు ఉన్నవారికి ప్రపంచం తలుపులు తెరుస్తోంది. ఈ నేపథ్యంలో యువత తమ బలాలు, ఆసక్తులు, అవకాశాలు చూసుకుని నిర్ణయం తీసుకోవాలి. "నిజం తెలుసుకున్నవాడే నిజమైన విజేత" అనే మాట ఇక్కడ సరిగ్గా సరిపోతుంది. ఉద్యోగం ఏదైనా, మనం చేసే పని మనసుకు నచ్చాలి, మన విలువలకు సరిపోవాలి, మన భవిష్యత్తును నిర్మించాలి. అదే నిజమైన విజయం.



**వచ్చే వారం:** ఒత్తిడి లేకుండా వృత్తి ఎంపిక: విద్యార్థి భవిష్యత్తుకు స్వతంత్ర దారి

E-mail: reddyu@gmail.com

## జొన్నవాడ దేవాలయంలో..
# ఇక సోలార్ వెలుగులు!



సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుని పరిశీలిస్తున్న ఆలయ ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి

జిల్లాలోని బుచ్చిరెడ్డి పాళెం మండలం జొన్నవాడలోని ప్రముఖ దేవాలయం శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి దేవస్థానం త్వరలో సోలార్ వెలుగులతో దేదీప్యమానం కానుంది. పర్యావరణ పరిరక్షణ మరియు విద్యుత్ పొదుపు లక్ష్యాలతో దేవస్థానంలో చేపట్టిన సోలార్ విద్యుత్ వ్యవస్థ మొదటి దశ ఏర్పాటు పనులు ఇటీవలే విజయవంతంగా పూర్తయ్యాయి. దేవస్థాన భవన సముదాయంపై ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ప్యానెళ్లు మరియు ఇతర అనుబంధ పరికరాలు పూర్తిస్థాయిలో అమర్చబడి వినియోగానికి సిద్ధం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు పనులను ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఇఓ వెంకటశ్రీనివాసులురెడ్డిలు ఇటీవల పరిశీలించి, పనులను నిర్ణీతకాలంలో పూర్తి చేసిన ఇంజనీరింగ్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

**యోగాతో ఆలయంలో సందడి :**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న జొన్నవాడ దేవస్థానంలో నెల్లూరు జిల్లా పతంజలి యోగ అధ్యక్షులు డా బి.విజయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు నిర్వహించడంతో ఆలయం సందడిగా కనిపించింది. ప్రాచీన భారతీయ ఋషులు ప్రపంచానికి అందించిన అమూల్యమైన యోగా సంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించి ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# 'అన్నదాత సుఖీభవ'తో రైతులకు రెట్టింపు సాయం



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కూటమి నాయకులు

'అన్నదాత సుఖీభవ'తో రైతులకు రెట్టింపు సాయం అందుతుందని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ నాలుగో విడత నిధుల విడుదల సందర్భంగా తోటపల్లి గూడూరు మండల పరిషత్ కార్యాలయం వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ పథకం కింద సర్వేపల్లి నియోజకవర్గంలో 27958 మంది రైతులకు రూ. 18. 50 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. ఈ విడతలో అన్నదాత సుఖీభవ పథకంతో రూ. 5వేలు, పీఎం కిసాన్ ద్వారా రూ. 2 వేలు కలిపి మొత్తంగా రూ. 7వేల రూపాయలు రైతులకు అందజేయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం రైతులకు సంపూర్ణంగా అండగా నిలుస్తోందన్నారు. గత జగన్‌రెడ్డి ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి వ్యవసాయ శాఖను మూతేసిందని, దేశమంతా అమలైన అనేక పథకాలను రాష్ట్రంలో ఆనవాళ్లు లేకుండా చేశారని, వ్యవసాయ యాంత్రీకరణ, బిందు తుంపర్ల సేద్యంతోపాటు భూసార పరీక్షలు, సూక్ష్మపోషకాల పంపిణీ తదితర కార్యకలాపాలన్నింటిని విస్మరించారని ఆయన వైసీపీ పాలనపై ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వ్యవసాయానికి ఊపిరొచ్చిందని, ఆగిపోయిన ఆ పథకాలన్నిటినీ తిరిగి అమలు చేస్తున్నారన్నారు. గత ఏడాది తుఫాన్ సంభవించినప్పుడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని ఫోన్‌లో కోరిన రెండు గంటల్లోనే రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించారని ఆయన గుర్తు చేశారు. రైతుల అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

# యోగాపై అలరించిన..కవి సమ్మేళనం



10లో 595 మార్కులు సాధించిన కార్తీకని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఈనెల 21న నెల్లూరులోని ఎంపీ నాయుడు ట్రస్ట్ ఫౌండర్ మోపూరు పెంచల నరసింహం ఆధ్వర్యంలో స్థానిక దర్గామిట్టలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 50మంది కవులతో ప్రముఖ కవి అవ్వారు శ్రీధర్‌బాబు కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసులు, కేంద్ర బాలసాహిత్య అవార్డు గ్రహీత గంగిశెట్టి శివకుమార్, కవి ఇంద్రగంటి మధుసూదన్, కవయిత్రులు తోట సులోచన, పార్లపల్లి నాగేశ్వరి తదితరులు పాల్గొని యోగ విశిష్టతను గురించి తెలిపారు. ఈ సందర్భంగా గత సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 595 మార్కులు సాధించిన కార్తీకకి నగదు బహుమతి, ప్రశంసా పత్రం, మెమెంటో ఇచ్చి శాలువాతో సత్కరించారు. కవయిత్రి నాగగాయత్రి, కవులు అంకబాబు, శివకృష్ణ, వై.మునీంద్ర, ప్రేమ్‌సాగర్, ఆదినారాయణ రెడ్డి, దయాకర్‌రెడ్డి, రాధాకృష్ణ మోహన్‌రాజు పాల్గొన్నారు.

# పినాకిని యూత్ ఆధ్వర్యంలో..సంగీత దినోత్సవం



చిన్నారులకి సర్టిఫికెట్‌లను ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జాకీర్ హుస్సేన్ నగర్‌లోని యస్.వి.ఆర్. హైస్కూలులో ఈనెల 21న ప్రపంచ సంగీత దినోత్సవ కార్యక్రమం జరిగింది. తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని సంగీతానికి స్పందించని వారు ఉండరని, ఎటువంటి భేదాలు లేకుండా మనుషుల్ని–మనసుల్ని కలిపే శక్తి సంగీతానికే ఉందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతోపాటు ఆటపాటల్లో ప్రోత్సాహాన్ని అందించాలని సూచించారు. అనంతరం కళాకారులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకుడు మురళీమోహన్‌రాజు సభాధ్యక్షులుగా వ్యవహరించారు. యనమల నాగేశ్వరరావు, నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఎ.జయప్రకాష్, స్కూలు కరెస్పాండెంట్ అందే శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ బి.రమేష్‌బాబు, చీదరాల చెన్నయ్య, అమితశ్రీ, శ్రీనివాసులు, శ్రీకర్‌రెడ్డి, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ వైభవం...!





ప్రముఖ కవి, రచయిత, పెన్నా రచయితల సంఘం అధ్యక్షుడు అవ్వారు శ్రీధర్‌బాబు - నిర్మలల కుమారుడు **సాయి శ్రీకాంత్ - గీతిక**(నారాయణరెడ్డిపేట వాస్తవ్యులు విగ్రహాల రమేష్ - కుమారిల కుమార్తె)ల వివాహం జూన్ 25వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

# విద్యతోనే ఉన్నత శిఖరాలు

- **డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత**

విద్యతోనే సమాజంలో ఉన్నత స్థాయి లభిస్తుందని, ప్రతి విద్యార్థి కష్టపడి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత ఆకాంక్షించారు. ఈనెల 24న ఆమె నెల్లూరు వీఆర్‌సిలో రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఎస్‌సీఇఆర్‌టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాలవాటిక కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉన్నతస్థాయిలో చదువుకున్నవారికి సమజాంలో ఎంతో గౌరవం ఉంటుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, ప్రతిభాపాటవాలతో ప్రతి విద్యార్థి రాణించాలని, కన్న తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచిపేరు తేవాలని ఆమె సూచించారు. ఎన్‌సిఇఆర్‌టీ ఆధ్వర్యంలో బాలవాటికను ఏర్పాటుచేసి విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరుస్తుండడం ఎంతైనా అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిఇఆర్‌టీ ఓఎస్డీ రమేష్‌బాబు, నోడల్ అధికారి నరసింహారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



# పదవి కాదు.. ప్రజాసేవే ముఖ్యం



- **విజయోత్సవ సభలో మంత్రి నారాయణ**

తనకు పదవి ముఖ్యం కాదని, ప్రజాసేవే ప్రధానమని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ చెప్పారు. ఇటీవల మైపాడు గేట్ సెంటర్‌లోని కేపీఆర్ మండపం వేదికగా జరిగిన కూటమి రెండేళ్ళ నమ్మకం–అభివృద్ధి సంక్షేమ విజయోత్సవ సభ ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం వదిలి వెళ్లిన లక్షల కోట్ల అప్పులను చెల్లిస్తూ, నాడు వైసీపీ నేతలు కక్షగట్టి ఆపేసిన అభివృద్ధి పనులన్నింటినీ కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించిందని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తూ అభివృద్ధి–సంక్షేమమే రెండు కళ్ళుగా కూటమి దూసుకుపోతోందని ప్రకటించారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని పేద విద్యార్థుల కోసం సొంతంగా 8,000 సైకిళ్లను సిద్ధం చేసి యువనేత లోకేష్ చేతులమీదుగా పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

# రైతులకు విరివిగా రుణాలివ్వండి



- **బ్యాంకర్లకు కలెక్టర్ సూచన**

జిల్లాలోని రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి బ్యాంకర్లు మరింత చొరవ చూపాలని, రైతులకు విరివిగా రుణాలు అందించి వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పశుసంవర్ధక, మత్స్య, కోళ్ల పరిశ్రమల వంటి వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించేలా బ్యాంకులు రుణాల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, డ్రోన్‌లు తదితర పరికరాల కొనుగోలుకు బ్యాంకులు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని, అలాగే కిసాన్ క్రెడిట్ కార్డుల జారీని వేగవంతం చేసి రైతులకు పంట రుణాలు సకాలంలో అందించాలని సూచించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు అందిస్తున్న పడవల కొనుగోలుకు కూడా రుణాలు మంజూరు చేయాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిశేఖర్, నాబార్డ్ డీడీఎం బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవేణి, పశు సంవర్ధక శాఖ అధికారి రమేష్ నాయక్, మత్స్యశాఖ అధికారి చాంద్ బాషా, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి,, బ్యాంకర్లు పాల్గొన్నారు.

# జడ్పీలో ఉద్యోగోన్నతులు



నియామక పత్రాలను అందజేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరుజిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలోని పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులకు జూనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. వారికి ఈనెల 24న నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఇఓ శ్రీధర్‌రెడ్డి, డిప్యూటి సీఇఓ బ్రహ్మయ్య తదితరులు ఆ ఉత్తర్వులను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఉద్యోగోన్నతులు పొందినవారిలో పి.ఉప్పు కొండయ్య, షేక్ అబ్దుల్‌ముజీబ్, ఎం.పెంచలయ్య, పి.శాంతి ఉన్నారు. అదేవిధంగా, ఇటీవల జడ్పీ పరిధిలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులు ఇద్దరికి కారుణ్యనియామకాల ద్వారా ఉద్యోగాలిచ్చారు. ఈ సందర్భంగా ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, 2021 నుంచి ఇప్పటివరకు 123 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించామని, మరో 247 మందికి ఉద్యోగోన్నతులు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

# హమాలీల సమస్యలు తీర్చండి



ధర్నా నిర్వహిస్తున్న హమాలీలు

తమ సమస్యలను పరిశీలించి పరిష్కరించాలంటూ నెల్లూరులో పౌరసరఫరాల శాఖ హమాలీలు ఈనెల 24న ధర్నా నిర్వహించారు. స్థానిక సివిల్ సప్లయిస్ గోడౌన్ ముందు చేపట్టిన ఈ ఆందోళనలో సీఐటియు జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి యామాల మధు మాట్లాడుతూ, హమాలీలకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. ప్రతినెలా 10వ తేదీ లోపునైనా బిల్లులు చెల్లించాలని, లేకుంటే వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో పడతాయని సూచించారు. ఈ ఆందోళనలో హమాలీల సంఘం నాయకులు సుధాకర్, కృష్ణారెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

## పాత పద్ధతిలోనే ఎరువులు ఇవ్వండి

- **రైతు నాయకుల ధర్నా**

రైతులకు పాతపద్ధతిలోనే ఎరువులను ఇప్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఏపీ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టంని రద్దుచేయాలని ఏపీ రైతుసంఘం, కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ఇటీవల నెల్లూరులోని జిల్ల వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ఆ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. చాలామంది రైతులకు రికార్డులు రాయించుకునేందుకు అవకాశాలు లేవని, వన్–బీలు సరిగా రావడం లేదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య, కౌలురైతుల సంఘం నాయకులు తుళ్ళూరు గోపాల్, పులిగండ్ల శ్రీరాములు, జొన్నలగడ్డ వెంకమరాజు, జనార్ధన్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు వ్యాపారులు సాగు చేయని భూములను కూడా రికార్డుల్లో చూపించి ఎరువులు తెచ్చుకుని, అధికధరలకు అమ్ముకుంటున్నారని విమర్శించారు.

# ఆలయాల్లో మళ్ళీ దొంగలుపడ్డారు

## • హుండీలు పగులగొట్టారు..డబ్బు దోచుకుపోయారు

నెల్లూరుజిల్లాలోని మారుమూల గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో తరచూ దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. గత వారం వరికుంటపాడు మండలంలోని మూడు ఆలయాల్లో చోరీలు జరగడం కలకలం రేపింది. మొన్నటికి మొన్న కొండాపురం మండలం సాయిపేటలోని ఆంజనేయస్వామి దేవాలయంలో కూడా చోరీ జరిగింది. తాజాగా ఈనెల 23న వరికుంటపాడు మండలంలోని రెండు ఆలయాల్లో దొంగలుపడ్డారు. అందినకాడికి సొత్తును అపహరించుకుపోయారు. ఈ మండలంలోని తూర్పుచెన్నంపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి ఈ చోరీలు జరిగినట్టు స్థానికుల సమాచారం. రామాలయం, అంకాళమ్మ దేవాలయాల్లో దొంగలు జొరబడి హుండీలను పొలాల్లోకి తీసుకుపోయి పగులగొట్టి, వాటిలో ఉన్న సుమారు 10వేల రూపాయలను అపహరించినట్లు చెప్తున్నారు. బుధవారం ఉదయం చూసేసరికి హుండీలు పొలాల్లో పడవేసి ఉండడం గమనించామని గ్రామస్తులు తెలిపారు. వారి సమాచారంతో ఎస్ఐ మధుసూదన్‌రావు, పోలీసులు ఆ ఆలయాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకుని దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

### సాయిపేట ఆలయంలో..

కొండాపురం మండలం, సాయిపేట గ్రామంలో ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలోకి ఈనెల 22వ తేదీ అర్ధరాత్రి సమయంలో దొంగలు జొరబడి ఆలయంలోని హుండీని పగులగొట్టి డబ్బును కాజేశారు. ఈ సంగతి తెలిసిన వెంటనే ఆలయ ఛైర్మెన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో ఆలయంలో పరిశీలనలు జరిపారు. నెల్లూరు నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆ హుండీలో దొంగలు మాయం చేసిన డబ్బు సుమారు 40 వేల రూపాయల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు.

### భద్రత కల్పించాలి...

జిల్లాలోని మారుమూల ఉన్న పల్లెలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల వద్ద పెద్దగా బందోబస్తు ఉండదు కనుక దొంగలు ఈ దారిని ఎంచుకున్నట్లుంది. ఇప్పటికే అనేక ఆలయాల్లో దొంగలు లక్షలాది రూపాయల సొత్తును దోచుకునిపోయారు. ఈ నేపథ్యంలో ఆలయాలకు భద్రత కల్పించాలని, దొంగతనాలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లోని బాధ్యతాయుత వ్యక్తులను, భక్తులను, యువతను స్థానికంగా ఉండే అధికారుల పర్యవేక్షణలో కమిటీలుగా ఎంపిక చేసి, నిఘా పెట్టించాలని, రాత్రివేళల్లో రక్షణ దళాలను నియమించి, ఆలయాల భద్రతకు దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

# పార్లపల్లిలో పీర్లపండుగ

మొహర్రం వేడుకల్లో భాగంగా ఈనెల 24న పొదలకూరు మండలంలోని పార్లపల్లిలో పీర్లపండుగను వైభవంగా నిర్వహించారు. మతపెద్దలు గ్రామ చావిడిలో పీర్లను ప్రతిష్ఠించి పూలతో అలంకరించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సంప్రదాయ బద్ధంగా అగ్నిగుండం ప్రవేశం చేశారు. పీర్లను గ్రామంలో ఊరేగించి పండుగ వేడుకను జరుపుకున్నారు.



# పర్వతరెడ్డికి సంఘీభావంగా ర్యాలీ

## • పాల్గొన్న 19 మంది ఎమ్మెల్సీలు

నెల్లూరు నగర వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా ఇటీవల రాష్ట్రం నలుమూలల నుంచి 19 మంది శాసనమండలి సభ్యులు నెల్లూరుకు తరలివచ్చి ర్యాలీ నిర్వహించారు. పర్వతరెడ్డికి సంబంధించిన కృష్ణచైతన్య విద్యాసంస్థలపై జరిగిన దాడులను ఖండించారు. కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతుందని వారు ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి తీరు మంచిది కాదన్నారు. ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్ లేళ్ళ అప్పిరెడ్డి, వరుదు కళ్యాణి, వీపి రామచంద్రరెడ్డి, కల్పలతరెడ్డి, భరత్, ఇసాక్ బాషా, రామసుబ్బారెడ్డి, మంగమ్మ రమేష్‌యాదవ్, డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేరిగ మురళీధర్, తూమాటి మాధవరావు, ఎం.డి రుహుల్లా, కె.శ్రీనివాస్ వెంకట రవీంద్రనాథ్, బొమ్మి ఇజ్రాయెల్, రవిబాబులతోపాటు నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు పాల్గొని పర్వతరెడ్డికి తమ సంఘీభావం తెలియజేశారు. అనంతరం నగరవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కక్ష సాధిస్తోందని, రెడ్ బుక్ రాజ్యాంగంతో అక్రమ కేసులు బనాయిస్తోందని విమర్శించారు.

### పర్వతరెడ్డిపై అక్రమకేసులు అన్యాయం - నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 24న ఆయన నెల్లూరులోని వైసీపీ కార్యాలయానికి వచ్చి పర్వతరెడ్డికి సంఘీభావం ప్రకటించారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అక్రమాలకు ఇదో నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను విస్మరిస్తే ప్రజలే తగు గుణపాఠం చెప్తారన్నారు.



# తాత్త్వికతలను వివరించే ఆధునికాంధ్ర కవిత్వం- తాత్త్విక వైవిధ్యం

మదరాసు డి.జి.వైష్ణవ కళాశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త కాసల నాగభూషణం ఇటీవల రచించిన "ఆధునికాంధ్ర కవిత్వం- తాత్త్విక వైవిధ్యం" అనే సిద్ధాంత గ్రంథానికి ఇటీవల నెల్లూరు సమీపంలోని వెంకటాచలంలో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో ఆవిష్కరణ జరిగింది. రచయిత కాసల నాగభూషణం కవితలు, కథలు, నవల, పీఠికలు యిలా అనేక ప్రక్రియల్లో దిట్ట. అనేక పురస్కారాలు, సన్మానాలు, బిరుదులు అందుకొన్నారు. ఈ గ్రంథాన్ని ప్రశంసిస్తూ ఆచార్య వి.రామచంద్ర చౌదరి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అందమైన తమ ముందు మాటల్లో "తాత్త్వికతలమీద వచ్చిన సమగ్రమైన విశ్లేషణనీ, తాత్త్వికతలను ఒక గీటు పెట్టి నిగ్గు తేల్చారు. ఏ కవీ ఒక ఉద్యమానికో, ఒక వాదానికో పరిమితమై ఉండడు. ప్రత్యంశమూ కాలాల పర్యంతం కనిపిస్తుందని, పరిశోధనా లోకానికి ఇదొక క్రొత్త దృక్కోణమ"ని శ్లాఘించారు.

1850 నుండి 2000 సంవత్సరం వరకు వెలువడిన తెలుగు ఆధునిక కవిత్వంలో కనిపించే విభిన్న దృక్పథాలు, సిద్ధాంతాలు మరియు ఆలోచనా ధోరణులు ఈ గ్రంథంలో ఉన్నాయి. ఆ కవిత్వం వెనుక ఉన్న లోతైన ఆలోచన, జీవన దృక్పథం గురించి, మనిషికి, సమాజానికి ఉన్న సంబంధాన్ని ఎలా నిర్వచిస్తున్నాడనేది, ఆ కవిత్వంలోని తాత్త్వికతను, దానిలో ఉన్న వైవిధ్యాల గురించి వివరింపబడ్డ గ్రంథం ఇది. ఒక కవి భావ కవిత్వ కాలంలో భావ కవిత్వం వ్రాశాడనుకుంటే, అదే కవి అభ్యుదయ కాలంలో అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వంకాలంలో విప్లవ కవిత్వం వ్రాయడం ఉంటుంది. దీనివల్ల కవి అనే వాడు ఒక్క సిద్ధాంతమే పట్టుకొని నిలబడి ఉండడు. కాలానుగుణంగా కవిత్వం వ్రాయడం ఉంటుంది. ఆధునిక కాలంలోని కవులు సమాజంలో జరిగే అన్ని సంఘటనలకు ప్రభావితులై రచిస్తారు. నాగభూషణం దీన్నే పట్టుకొన్నారు. ఏదైనా ప్రత్యామ్నాయ విమర్శ చెయ్యాలనే "చిరదీక్షా శిక్షా తపస్సమీక్ష"లో ఫలించిన అన్వేషణ తాలూకు అంశాలే ఇందులో పొందుపరచబడ్డాయి. కవితోద్యమాలకు మించి కవి చైతన్యానికి గుర్తింపు ఉండాలని భావించాడు. అన్ని నిబద్ధతలకు అతీతంగా కవిత్వాన్ని ఒక కళగా, సౌందర్యానికి సజీవ వ్యాఖ్యానంగా పరిశోధనలో ఆయన దర్శించాడు. వివిధ తాత్త్వికతలను ఒక గొడుకు క్రిందికి తీసుకొని వచ్చి ముడివేసే ప్రయత్నంలో సఫలీకృతుడయ్యాడు. తాత్త్వికత అంటే ఒక కవి వ్రాసిన కవిత్వం వెనుకనున్న లోతైన ఆలోచన, జీవన దృక్పథం లేదా సిద్ధాంతమని తెలియజెప్పారు.





రచయిత:
**డా. కాసల నాగభూషణం**
వెల: రూ. 500/- పేజీలు: 354
ప్రతులకు: శ్రీమతి కె.కిరణ్మయి
23/13, ఫస్ట్‌ఫ్లోర్, కెనరా బ్యాంక్ కాలనీ, గాంధీనగర్, సాలిగ్రామం, చెన్నై - 93.
సెల్: 9444452344

నాలుగు అధ్యాయాలుగా రాసిన ఈ గ్రంథంలో మొదటిది "ఆధునికాంధ్ర కవితా విమర్శ – పునస్సమీక్ష" దీనికి కావలసిన అంశాలు ఏమిటి? అనేది వివరించారు. రెండో అధ్యాయం "వివిధ తాత్త్వికతల ప్రాచుర్యం"లో సామాజిక తాత్త్వికత, మానవతా తాత్త్వికత, నైతిక తాత్త్వికత, మత తాత్త్వికత, ఆర్థిక తాత్త్వికత, రాజకీయ తాత్త్వికత అనే ముఖ్యమైన తాత్త్వికతలు ఉన్నాయని, ఇవన్నీ కవిత్వంలో సౌందర్య తాత్త్వికతలో అంతర్భూతమై ఉన్నాయని వివరించే ప్రయత్నం చేశారు. అంటే వాదాలకు, ఉద్యమాలకు, ధోరణులకు మించి కవి చైతన్యానికి గుర్తింపు ఉండాలని వివరించారు. మూడో అధ్యాయంలో "సామాజిక తాత్త్వికత అంతర్గత అంశాలు"లో కవులు ఎందుకు కలం పట్టారు? పద్య కవిత్వం వదిలేసి వచన కవిత్వంలోకి ఎందుకొచ్చారు అన్న ప్రశ్నకు సమాధానంగా సామాజిక చైతన్యానికి ఎన్నో అంతర్గత అంశాలు ఇమిడి ఉంటాయని, అంటే సంఘ సంస్కరణ, హేతువాద విస్తరణ, మూఢాచారాలు, హరిజనోద్ధరణ, స్త్రీ వాద, దళితవాద చేతనలు ఈ అంశానికి ఎలా తోడ్పడ్డాయో చెప్పారు. నాల్గవది "సామాజిక తాత్త్వికత–అంతర్గత తాత్త్విక వలయాలు"లో సామాజిక తాత్త్వికతలోనే అంతర్లీనంగా ఉన్న మత, నైతిక, ఆర్థిక, సౌందర్య తాత్త్వికతల నిర్వచనాలను, ఏ ఏ కవులలో ఈ కవితా ధోరణులు ప్రతిఫలిస్తున్నాయో ఆ వివరాలను వివరించే ప్రయత్నం చేశారు.



సమీక్ష:
**డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య**
సెల్: 9490400858

## కాలధర్మం

# శనగవరపు జయలక్ష్మి



నెల్లూరు పొగతోటలోని ప్రముఖ డయాబెటిక్ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.సత్యనారాయణమూర్తి సతీమణి శనగవరపు జయలక్ష్మి ఈనెల 19వ తేదీ శుక్రవారం కాలధర్మం చెందారు. ఆమె వయసు 67 సంవత్సరాలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. దీప, డాక్టర్ శ్వేత. జయలక్ష్మి స్వస్థలం ఒంగోలు. తల్లిదండ్రులు వంగర కృష్ణమూర్తి–వరలక్ష్మి. డాక్టర్ సత్యనారాయణమూర్తితో వివాహమయ్యాక, భర్తతో పాటు ఆమె నెల్లూరులో స్థిరపడ్డారు. నగరంలోని బీవీనగర్‌లో వీరు నివాసం ఉండేవారు. జయలక్ష్మి తొలినుంచి ప్రకృతి ప్రేమికురాలు. మొక్కలంటే మహా ఇష్టం. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడాలని తపనపడేది. ఆమె తన ఇంటిని నందనవనంలా మార్చుకుంది. తాము ఉండేది మిద్దెఇంట్లోనైనా ఆకుకూరలు, కూరగాయల మొక్కలతో మిద్దెనంతా కళకళలాడించేది. మిద్దెమీద ఉన్నామని సరిపెట్టుకోకుండా, కుండీల్లో మొక్కలు పెంచుకుంటే ఆరోగ్యానికి మంచిదే కాక, డబ్బులు కూడా ఆదా అవుతాయని ఆమె అందరికీ చెప్పేది. ఎలాంటి రసాయనాలు లేకుండానే ఆమె వాటిని పండించేది. ఆమె మాటలకు ఇరుగుపొరుగు వారు కూడా స్ఫూర్తిని పొంది, ఆచరించేవారు. నగరంలో మిద్దెతోటల సంస్కృతిని ఆమె ఎంతగానో ప్రోత్సహించేవారు కూడా. పెరటితోటల పెంపకంలో ఆమె ఆసక్తిని గమనించి ఈటీవీ బృందం వారు ఇటీవల ఆమెకు 'రైతు నేస్తం' అవార్డును కూడా అందజేసి అభినందించారు. ఆమె మరణంతో వారి కుటుంబం శోకసముద్రమైంది. ఆమె మృతికి చింతిస్తూ.. సతీమణి మృతితో ఆవేదనలో ఉన్న డాక్టర్ సత్యనారాయణమూర్తికి, మాతృమూర్తి ఇక లేరనే బాధతో ఉన్న వారి పిల్లలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది..'లాయర్'!..





# నాయకులు సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలి

## వెంకయ్య 'నాయకుడు' పుస్తకావిష్కరణ సభలో వెంకయ్య

రాజకీయాల్లో ఉన్నవారు, కొత్తగా రాజకీయాల్లోకి వస్తున్నవారు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని భారత గౌరవ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. సీనియర్ పాత్రికేయులు మాశర్మ రచించిన వెంకయ్య నాయుడి జీవిత చరిత్ర 'వెంకయ్య నాయకుడు – ఉదయగిరి నుంచి ఉపరాష్ట్రపతి వరకు' పుస్తకాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్లో ఆత్మీయుల సమక్షంలో ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "రాజకీయ నాయకులు సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలి. దురదృష్టవశాత్తూ ఇప్పుడు రాద్ధాంతాలు ఎక్కువయ్యాయి. నేతలు హుందాగా, సంస్కారవంతంగా ప్రవర్తించాలి. ఒక పార్టీ తరఫున ఎన్నికై మరో పార్టీలోకి మారిపోతున్నారు. ఇలా పార్టీలు మారాలనుకుంటే ఎన్నికై పదవికి రాజీనామా చేసి మారాలి. ఈ మేరకు 10వ షెడ్యూలుకు సవరణ జరగాలి. చట్టసభ సభ్యుల అనర్హత పిటిషన్లను స్పీకర్లు ఏళ్ల తరబడి పరిష్కరించకుండా తమ వద్దే పెట్టుకోవడం సరికాదు. త్వరితగతిన పరిష్కరించాలి." అని స్పష్టం చేశారు.

ఉచిత పథకాలు అనుచితమని వెంకయ్యనాయుడు స్పష్టం చేస్తూ ఏ పార్టీ అయినా ఉచిత పథకాల అమలుకు ఉన్న ఆర్థిక వనరులను ప్రకటించిన తర్వాతే ఉచిత పథకాలకు హామీ ఇవ్వాలన్నారు. ప్రజల్లోంచే ఉచితాలు వద్దని డిమాండ్లు రావాలన్నారు. పేదలకు మాత్రమే విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వాలన్నారు. తన రాజకీయ ప్రస్థానం గురించి వెంకయ్య నాయుడు అనుభవాలు పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తాను ఉన్నత స్థానాలకు చేరుకోవడం వెనక ఆడ్వాణీ, వాజ్‌పేయిల ప్రోత్సాహం ఎంతో ఉందని, గోడలపై వాజ్ పేయి సభ గురించి తన చేతులతో స్వయంగా రాశానని నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. రాజకీయ జీవితానికి, దేశ సేవకు అంకితమయిపోయి కుటుంబానికి న్యాయం చేయలేకపోయానని, అయితే తన శ్రీమతి ఉషమ్మ, పిల్లలు దీపమ్మ, హర్షవర్ధన్‌లు తనను ఎంతో అర్థం చేసుకున్నారని అన్నారు.

వాజ్‌పేయి, ఆడ్వాణీ తనకు మార్గదర్శకులని, గురుతుల్యులని చెబుతూ, అయితే పార్టీ ప్రయోజనాల కోసం రెండు సందర్భాల్లో తాను కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, అవి తనకు ఎంతో బాధ కలిగించాయని చెప్పారు. గోద్రా అల్లర్ల అనంతరం మోదీని గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలగించాలని డిమాండ్లు వచ్చినప్పుడు వాజ్‌పేయి కూడా అందుకు మొగ్గ చూపారని, కానీ వారి అభిప్రాయానికి వ్యతిరేకంగా పార్టీలో మెజారిటీ అభిప్రాయం ఉందని, ఇదే విషయాన్ని వారికి చెప్పి ఒప్పించడం తన జీవితంలో ఎదురయిన ఒక కష్టమైన అనుభవమని గుర్తు చేసుకున్నారు. 2014లో ఆడ్వాణీ అభ్యర్థిత్వాన్ని కాదని మోదీని ప్రధానమంత్రి అభ్యర్థిగా తాను ప్రతిపాదించడం కూడా అలాంటి అనుభవమేనని చెప్పారు. ఉపరాష్ట్రపతిగా తనను పార్టీ ఎంపిక చేసినప్పుడు కన్నీళ్లు వచ్చాయని, అమ్మలాంటి పార్టీ కార్యాలయాన్నిమళ్లీ చూసే అవకాశం లేకపోవడమే అందుకు కారణమని భావోద్వేగంతో గుర్తు చేసుకున్నారు.

వెంకయ్యనాయుడు జీవితం అందరికీ ఆదర్శమని, ప్రముఖ శాస్త్రవేత్త, డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్ డా.సతీష్‌రెడ్డి అన్నారు. బాల్యం నుంచి పోరాటాలు, ఉద్యమాలతో అంచలంచెలుగా ఎదుగుతూ సమున్నత స్థాయికి ఎదిగిన వెంకయ్యనాయుడు జీవితం యువతకు మార్గదర్శకమన్నారు. వెంకయ్యనాయుడుకున్నంత మేధాశక్తి మరెవరికీ ఉండదని, ఎప్పుడో పాతికేళ్ళప్పుడు చూసిన వ్యక్తిని కూడా పేరు పెట్టి పలకరించే అద్భుత జ్ఞాపకశక్తి ఆయన సొంతమని అన్నారు.

కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, శ్రీనివాస్ వర్మ, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బ్యాడ్మింటన్ జాతీయ ప్రధానకోచ్ పుల్లెల గోపీచంద్, జీఎంఆర్ గ్రూప్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు, రచయిత మాశర్మ తదితరులు ప్రసంగిస్తూ వెంకయ్య నాయుడి వ్యక్తిత్వాన్ని కొనియాడారు.

### వెంకయ్య వాక్పటిమ అసాధారణం - మంత్రి సత్యకుమార్

వెంకయ్యనాయుడి వాక్పటిమ అసాధారణమని, ఏ అంశంపైనయినా ఆయన అనర్గళంగా, చతురోక్తులతో మాట్లాడి అందరినీ ఆకట్టుకోగలరని వెంకయ్యనాయుడి శిష్యుడు.. రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ చెప్పారు. వెంకయ్య నాయుడు సమయపాలన, క్రమశిక్షణ అపూర్వమని, ప్రాసలు ఉపమానాలతో ఆయన వాగ్ధాటి ఇంకా అపూర్వమని అన్నారు. ఉప రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆంధ్ర రాష్ట్రాభివృద్ధికి ఎన్నో విద్యా, వైద్యసంస్థలు వచ్చేందుకు నిరంతరం పాటుపడ్డారని, అప్పట్లో 16 మంది కేంద్రమంత్రులతో సమావేశమై రాష్ట్రాభివృద్ధికి చేయదగిన ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని ఆయన గుర్తుచేశారు. వెంకయ్యనాయుడు వద్ద తాను సుమారు పాతికేళ్ళు శిష్యరికం చేశానని, వారి కుటుంబసభ్యుల్లో తానూ ఒకడిగా ఉండేవాడినని, ఇప్పుడు తనకు వచ్చిన గుర్తింపు, తన అస్తిత్వం.. ఈ స్థానం అన్నీ వెంకయ్యనాయుడు వల్లే లభించాయని, వారికి జీవితకాలం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా వెంకయ్య నాయుడుకు ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com